
నవతెలంగాణ 1
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
శుక్రవారం 3 మార్చి 2023



డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన



నవతెలంగాణ రామచంద్రాపురం

రామచంద్రాపురం డివిజన్ అశోక్ నగర్లో గత 10 సంవత్సరాల నుంచి ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి గురువారం నూతన పైపు లైన్ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ శంకుస్థాపన చేశారు. బస్తీ దశలో భాగంగా కార్యనివాసులు గతంలో కార్పొరేటర్ దృష్టికి డ్రైనేజీ సమస్య తీసుకురావడంతో వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా నేడు సుమారు 11 లక్షల రూపాయిల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మంజూరు చేయించి పనులను ప్రారంభించారు. అలాగే త్వరలోనే అశోక్ నగర్లో సుమారు 50 లక్షల విలువచేసే సీసీ రోడ్ పనులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తాం అని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శేష రెడ్డి, ఖలీమ్, చారి, నాగభూషణ్ చారి, శ్రీనివాస్, అమృత్ సాగర్, రవి తేజ, జ్యోతి, కాలనీ సొసైటీ మెంబెర్స్ మరియు అధికారులు పాల్గొన్నారు.

కరెంటు కోతలతో రైతుల కష్టాలు



నవతెలంగాణ-న్యాల్కల్

కరెంటు కోతలతో రైతుల కష్టాలు పడుతున్నారని తెలంగాణ జన సమితి పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి మొగడంపల్లి ఆశప్ప అన్నారు. 24 గంటలు కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా, సభలు సమావేశాల్లో గొప్పలు చెప్పుకోవడానికే పరిమితమయ్యారని అన్నారు. రేజింతల్, ఎల్గోయి గ్రామాలలోని వ్యవసాయ పొలాలను గురువారం మోగడంపల్లి ఆశప్ప పరిశీలించారు. కరెంటు కోతల విషయాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు 24 గంటలపాటు విద్యుత్ సరఫరా చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గోపాల్ రెడ్డి నరసింహులు యాదవ్ మక్బూల్ యూనిస్ ప్రేమ్ కుమార్ వైద్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు పెంచుతారా.. గద్దె దిగుతారా!



- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు

నవతెలంగాణ -మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

అంగన్వాడీ ఉద్యోగులకు జీతాలు పెంచుతారా..! గద్దె దిగిపోతారా అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. గురువారం వేలాది మంది అంగన్వాడీ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట మహాధర్నా, వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఆన్లైన్ పని విధానం తీసుకువచ్చి 26 రకాల పనులు చేయిస్తున్నారన్నారు. ఎంతో కష్టపడి ప్రజలకు సేవ చేస్తున్న అంగన్వాడీ ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. బీజేపీ అనుసరించే విధానాల్ని రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అంగన్వాడీలు ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకుంటుంటే ఓర్వలేక సంఘంలో చీలిక తెచ్చేందుకు ప్రయత్నించినా అంగన్వాడీ ఉద్యోగులు ఐక్యంగా ఉండి పోరాడుతున్నారన్నారు. జీవో 14, 19 లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా మహిళలు, చిన్నారులకు ఎన్నో సేవలు అందుతున్నాయన్నారు. అంగన్వాడీ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. పెండింగ్ సమస్యల్ని పరిష్కరించాలన్నారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంగ మాట్లాడుతూ రాష్ట్రంలో 70 వేల మంది అంగన్వాడీ ఉద్యోగులు ఏకమైతే వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించడం పెద్ద కష్టమేమీ కాదన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.యాదగిరి మాట్లాడుతూ అంగన్వాడీలు ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని కోరారు. సీపీఐఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు అతిమేల మాణిక్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అశోక్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ పాల్గొని మద్దతుగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు నాగేశ్వర్‌రావు, మహిపాల్, శ్రావణ్, అంగన్వాడా నాయకులు శోభ,, ఏసుమని, సంగీత, విజయలక్ష్మీ, జమున, అరుణ, కల్పన, ఇ ందిరా, శేకమ్మ, కవిత, జమున, గౌరమ్మ, దత్తు పాల్గొన్నారు.











మల్కాపూర్‌లో చురుకుగా కొనసాగుతున్న సీసీరోడ్డు పనులు



నవ తెలంగాణ-హత్నూర

మండలంలోని మల్కాపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులనుండి 15 లక్షలు మంజూరు అయ్యాయని గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం పనులు చేయడం జరుగుతుందన్నారు. అడగగానే నిధులు మంజూరు చేసిన స్థానిక ఎమ్మెల్యే మధు రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, రాజా గౌడ్, వార్డ్ మెంబర్ నిరుడు బిక్షపతి, రమేష్, మల్లేష్, రాములు, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

పుస్తె మట్టెల అందజేత



నవతెలంగాణ-ఐడీఏ బొల్లారం

గడ్డపోతారం గ్రామానికి చెందిన వడ్డే మల్లయ్య కూతురు మైసమ్మ వివాహానికి పులిగిల్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ అధినేత, గడ్డపోతారం సర్పంచ్ పులిగిల్ల ప్రకాశ్ చారి గురువారం పుస్తె మెట్టెలు అందజేశారు.

14న సదరం శిబిరం

నవతెలంగాణ-సంగారెడ్డి

ఈ నెల 14న సదరం శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గాయత్రీ దేవి గురువారం తెలిపారు. సంబంధిత స్లాట్స్ ఈనెల 6న కేటాయిస్తారని తెలిపారు. అభ్యర్థులు మీసేవ ద్వారా స్లాట్స్ బుక్ చేసుకుని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించనున్న సదరం శిబిరానికి హాజరుకావాలని ఆమె పేర్కొన్నారు.

సిద్ధాపూర్ కాలనీలో ఆంజనేయ స్వామి ప్రతిష్ఠ మహోత్సవం



నవ తెలంగాణ-సదాశివపేట

పట్టణ పరిధిలోని శ్రీకృష్ణ నగర్ కాలనీ, సిద్ధాపూర్ రోడ్‌లో గురువారం సంజీవిని పర్వత ఆంజనేయస్వామి ప్రతిష్ఠ మహోత్సవం 108 వైరాగ్య శికామణి అవధూత గిరి మహారాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు సామూహికంగా కళశాలతో ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

డబుల్ బెడ్రూం ఇండ్ల బాగోతంపై విచారణ చేయాలి



నవతెలంగాణ-జహీరాబాద్

డబుల్ బెడ్రూం ఇండ్ల బాగోతంపై విచారణ చేయాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి కె.నరసింహులు అన్నారు. గురువారం పట్టణ ప్రజలతో కలిసి సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు డబుల్ బెడ్రములపై విచారణ జరగాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిములు మాట్లాడుతూ జహీరాబాద్ పట్టణములో నిరుపేదలకు డబుల్ బెడ్రములలో అనర్హులకు ఇచ్చారన్నారు. ప్రజలకు ముందు సమాచారం ఇచ్చి అందరూ వచ్చిన తరువాతనే లాటరీ ఓపెన్ చేయాలన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు రాములు, చంద్రమ్మ పాల్గొన్నారు.

బుదేరా డిగ్రీ కళాశాలలో ఇంటర్మిడిట్ ప్రవేశ పరీక్ష కేంద్రం



నవతెలంగాణ-మునిపల్లి

సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందేందుకుగాను ఈ నెల 5వ తేదీన మండలంలోని బుదేరా వద్ద గల సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో సీఈఓ సెట్ పరీక్ష జరుగుతుందని ఉదయం మహిళా గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అరిఫా తెహాసిన్ ఆరా తెలిపారు. పరీక్ష ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందని ఆమె తెలిపారు.

పేదల ఆర్థిక అభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యం



- ఎమ్మెల్యే జీఎంఆర్

నవతెలంగాణ-జిన్నారం

నిరుపేదల ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం, శ్రేయస్సు లక్ష్యంగా సీఎం కేసీఆర్ అనేక ప్రజాహిత కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా చేపడుతుండడం సంతోషంగా ఉందని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. జిన్నారం మండలం జంగంపేట గ్రామంలో, హెచ్ఎండీఏకు భూములు ఇచ్చిన లబ్ది దారులకు పట్టా సర్టిఫికెట్లను, మండల కేంద్రమైన జిన్నారంలోని స్థానిక రైతు చైతన్య వేదిక వద్ద నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ జిన్నారం మండల పరిధిలోని 41 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాల కిందట మంజూరైన 401 లక్షల రూపాయలు చెక్కులు,జంగంపేట గ్రామంలో 94 మంది లబ్దిదారులకు హెచ్ఎండిఏ కు భూములు అందజేసినం దుకుగాను పట్టా సర్టిఫికెట్లు పంపిణీ చేయడం చూస్తుంటే పేద వర్గాల కోసం తెలంగాణ ప్రభుత్వం కొనసాగిస్తున్న కృషి కి నేడు ప్రజలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.ప్రభుత్వం పారదర్శకతతో కూడిన విధానాలతో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరంగా గా కొనసాగిస్తుందన్నారు. జంగంపేట గ్రామంలో హెచ్ఎండిఏకి భూముల అందించిన రైతులందరికీ వారి సంక్షేమం శ్రేయస్సు దృష్ట్యా ఎకరాకు 600 గజాల చొప్పున ప్లాట్లను అందజేస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, జిన్నారం మండల పరిషత్ అధ్యక్షులు దమ్మ గౌని రవీందర్ గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత జిన్నారం వెంకటేష్ గౌడ్, తహసిల్దార్ దశరథ్ సింగ్రాథోడ్, సర్పంచులు అంత రెడ్డి గారు లావణ్య శ్రీనివాస్ రెడ్డి, వెంకటయ్య, పులిగిల్ల ప్రకాశం చారి, ఆంజనేయులు, ఖదీర్,సరిత సురేందర్ గౌడ్ ,వావిలాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ సేరికారి శంకర్ రెడ్డి,జిన్నారం మండలం డిప్యూటీ తాసిల్దార్ సతీష్,జిన్నారం సీఐ వేణు కుమార్, ఎంపీటీసీ కోరబోయిన లావణ్య నరేష్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ నీలంసంజీవ తదితరులు పాల్గొన్నారు. జగంపేట గ్రామంలో పట్టా సర్టిఫికెట్లు అందుకున్న లబ్దిదారులు,జిన్నారం మండల వ్యాప్తంగా కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ పథకాల కిందట 401 లక్షల రూపాయల చెక్కులను అందుకున్న లబ్దిదారులు ఈ సందర్భంగా పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి,మండల ప్రజాప్రతినిధులకు అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

శ్రీకర ఆర్గానిక్స్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం

- ఐదుగురు కార్మికులకు గాయాలు

నవతెలంగాణ-ఐడీఏ బొల్లారం

సంగారెడ్డి జిల్లా బొల్లారం పారిశ్రామిక వాడలోని శ్రీకర ఆర్గానిక్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఐదుగురు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. బొల్లారం సీఐ సురెందర్‌రెడ్డి కథనం ప్రకారం... గురువారం ఉదయం 10.25 గంటలకు బొల్లారం పారిశ్రామిక వాడలోని శ్రీకర ఆర్గానిక్స్ పరిశ్రమలో గల బాయిలర్‌లో మెటీరియల్ వేస్తుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించారు. దీంతో అక్కడ పని చేస్తున్న కార్మికులు అనూప్, శ్రీకమల్, రమేష్, రామచంద్ర, రాజులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన కార్మికులను వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదం

బొల్లారంలోని శ్రీకర ఆర్గానిక్ పరిశ్రమలో గురువారం యజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.రాజయ్య అన్నారు. యజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికుల వైద్య ఖర్చులను యజమాన్యమే భరించాలన్నారు. కార్మికులు కోలుకుని డ్యూటీకి వచ్చేదాకా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరగకుండా యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకోవాలనాన్రు. కార్మికులకు న్యాయం జరగకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

విద్యాసంస్థల్లో జరుగుతున్న కుల వివక్షతను అరికట్టాలి



నవతెలంగాణ జహీరాబాద్

విద్యాసంస్థలు వేధించడంతో ఎంతోమంది విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నారని యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు శ్యామ్ అన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జహీరాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలియజేస్తూ విద్యాసంస్థల్లో జరుగుతున్న కుల వివక్షతను అరికట్టాలని, మెడికో విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు మరియు బీటెక్ విద్యార్థిని రక్షిత ఆత్మహత్యకు కారకులైన దుండగులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు శ్యాం మాట్లాడుతూ ఉన్నత విద్యాసంస్థల్లో కుల వివక్షత ఇప్పటికీ విపరీతంగా కొనసాగుతుండడం సిగ్గుచేటైన విషయమని, ఈ కారణంగా ఎంతో మంది విద్యార్థినీ, విద్యార్థులు అవమానాలకు గురై చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, విద్యాసంస్థల్లో జరుగుతున్న కుల వివక్షతను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వ పెద్దలు ఖండించి వదిలేయడం సరికాదని, రాబోయే కాలంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టిఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు సువర్ణ ,జిల్లా కార్యదర్శి సమియొద్దీన్, జిల్లా కమిటీ సభ్యులు గౌతమ్,శివశేఖర్,ప్రశాంత్ జహీరాబాద్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, యం. డి. సిరాజుద్దీన్ ,సి.హెచ్ విఠల్,న్యాల్కల్ మండల ప్రధానకార్యదర్శి విజయ్,మొగుడం పల్లి ప్రధాన కార్యదర్శి యాదయ్య, ఏడుకొండలు, యోహాన్, తానిషా తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గండిపల్లి ప్రాజెక్టును మరిచిన పాలకులు

- టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి

నవతెలంగాణ-అక్కన్నపేట : అక్కన్నపేట మండలం గండిపల్లి ప్రాజెక్ట్ కాంగ్రెస్ హయాంలో పునాది రాయి వేసినా ఇప్పటికీ పూర్తి కాకపోవడం ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అసమర్థ పాలనకు నిలువుటద్దమని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం గండిపల్లి ప్రాజెక్టును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రాజెక్టుకు పునాదిరాయి వేసి 70 శాతం పనులు పూర్తి చేసి చేశారన్నారు. మిగతా పనులను ఎమ్మెల్యే సతీష్ కుమార్ అధికారంలోకి వచ్చాక పూర్తి చేయకుండా రైతులను మోసం చేశారని ఆరోపించారు. ఆనాడు హాఫ్ టీఎంసీ కింద శంకుస్థాపన చేసి దాదాపు 300 ఎకరాల భూమిని సేకరించి, పనులు పూర్తి చేశామన్నారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయకుండా సీఎం కేసీఆర్ దీన్ని ఒకటిన్నర టీఎంసీకి పెంచి, కుర్చీ వేసుకుని ప్రాజెక్టు పూర్తి చేస్తానని చెప్పి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీంతో ప్రజలు నమ్మి సతీష్ కుమార్‌కు ఎమ్మెల్యేగా పట్టం కట్టారన్నారు. గద్దెనెక్కిన ఎమ్మెల్యే కనీసం గండిపల్లి ప్రాజెక్టు వైపు కూడా చూడలేదని ఆరోపించారు. బీఆర్ఎస్‌పాలనలో తోటపల్లి, గండిపల్లి, గౌరవెల్లి ప్రాజెక్టులను పక్కనపెట్టి , సిద్దిపేట ప్రాంతంలో మల్లన్న సాగర్, కొండపోచమ్మ, రంగనాయక సాగర్ పూర్తి చేశారన్నారు. గౌరవెల్లి, గండిపల్లి, తోటపల్లి ప్రాజెక్టులు మొదలైనప్పుడు అసలు ఈ ప్రాజెక్టులే లేవన్నారు. లేటుగా మొదలుపెట్టిన ఆ ప్రాజెక్టులు పూర్తిచేసి, గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టుల నిర్వాసితులను మోసం చేశారని ఆరోపించారు. మీ నియోజకవర్గ ప్రాజెక్టులను పూర్తి చేసి, ఈ ప్రాజెక్టులపై వివక్ష ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ మొదలుపెట్టినందుకే ఈ ప్రాజెక్టులపై, ఇక్కడి ప్రజలపై కక్ష గట్టారా? అని ప్రశ్నించారు. స్వయంగా సీఎం కేసీఆర్ ఈ ప్రాజెక్టులను సందర్శించి కుర్చీ వేసుకొని పూర్తి చేస్తారన్న హామీ ఏమైందని రేవంత్ రెడ్డి అడిగారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే దాదాపు 30,000 ఎకరాలకు మీరందుతుందని, కాబట్టి ఎమ్మెల్యే స్పందించి ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తిచేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ త్వరలో అధికారంలోకి వస్తుందని తప్పనిసరిగా ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తుందని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం కట్కూరు క్రాస్ నుండి అంతక పేట, జనగాం స్టేజ్, చౌటపల్లి స్టేజ్ తోటపల్లి స్టేజ్, గాంధీనగర్, కిషన్ నగర్ మీదుగా పాదయాత్ర హుస్నాబాద్ కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంటు సభ్యులు పొన్నం ప్రభాకర్,హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తూముకుంట నరసారెడ్డి, పిసిసి నెంబర్ కేడం లింగమూర్తి, హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య మండల పార్టీ అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య, అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, హుస్నాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు బంక చందు, గండిపల్లి రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్ : పేదల బతుకులు బాగుపడాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని తెలంగాణ కాంగ్రెస్ టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం రేవంత్ రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో పాద యాత్ర రాత్రి హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాకు చేరుకుంది . ఈ సందర్భంగా టిపిసిసి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ ఎంపీగా గెలుపొందిన బిజెపి బండి సంజయ్ గెలిచి నాలుగున్నర సంవత్సరాలు, బిజెపి పార్టీ అధ్యక్షునిగా మూడు సంవత్సరాలు గడుస్తున్నా కరీంనగర్ జిల్లాకు తీసుకువచ్చిన నిధులు ఎన్నో చెప్పాలని ప్రశ్నించారు. ఎంపీగా గెలిపిస్తే బిజెపి పార్టీ అధ్యక్షుడైన బండి నిన్ను గెలిపించిన కరీంనగర్ ప్రజలకు ఏమిచ్చినావో చెప్పాలన్నారు. తెలంగాణలో మీరు సాధించిన, తెచ్చిన నిధులపై హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో చర్చిం చేందుకు మేము సిద్ధంగా ఉన్నాం మీరు సిద్ధమా అని ప్రశ్నించా రు. తెలంగాణలో బిజెపి నాయకులకు పదవులు దక్కించుకొని ప్రజలకు మాత్రం పంగనామాలు పెడుతున్నారన్నా రు. తెలంగాణ రాష్ట్రంలోని ఏ ప్రాజెక్టుకు జాతీయ హెూదా కేంద్ర ప్రభుత్వం కల్పించలేకపోయిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 45 కోట్ల బడ్జెట్ లో తెలంగాణ ప్రభుత్వానికి ఒక్క రూపాయి కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో 1947 నుండి 2004 వరకు 57 లక్షల కోట్ల అప్పు చేస్తే, బిజెపి అధికారంలోకి వచ్చిన 8 సంవత్సరాలలో రూ. 100 లక్షల కోట్లు అప్పుచేసి దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిదన్నారు. ఆదాని అంబానీ రూ.12 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసి న బిజెపి కుబేరుల కొమ్ము కాస్తుందన్నారు. కేంద్రం దేశంలో నిరుద్యోగ యువతను మోసం చేస్తుందని దీంతో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించకపోవడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తానన్న కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 18 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తే తెలంగాణకు 70 లక్షల ఉద్యోగాలు దక్కివెన్నారు. తెలంగాణలో ఏ ఒక్క బీజేపీ అభ్యర్థి గెలవద్దని కరీంనగర్ లో బండి సంజయ్ కి డిపాజిట్ గల్లత్తు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రెండు లక్షల రుణమాఫీ, 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం , నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఆరోగ్యశ్రీ పునరుద్ధరణ 5 లక్షల ఉచిత వైద్యం అందిస్తామన్నారు. గౌరవెల్లి గండిపల్లి ప్రాజెక్ట్ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేసుకుని పూర్తి చేస్తానన్న హామీ ఏమైందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు, మాజీ పార్లమెంట్ సభ్యులు జీవన్ రెడ్డి, జానారెడ్డి, సుదర్శన్ రెడ్డి బలరాం నాయక్, పొన్నం ప్రభాకర్, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బంక చందు, జంగపల్లి ఐలయ్య, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ మెంబర్లు సింగల్ విండో చైర్మన్లు డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.







యాజమాన్యం వేధింపులతో ఉరేసుకొని కార్మికుడి ఆత్మహత్య

నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని పీఈటీఎల్ పరిశ్రమలో యాజమాన్యం వేధింపుల కారణంగా తీవ్ర మనస్థాపానికి గురైన కార్మికులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం జరిగింది. కుటుంబ సభ్యులు, తోటి కార్మికులు తెలిపిన వివరాల మేరకు పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని పిఈటిఎల్ పరిశ్రమలో కృష్ణయ్య(58) సీనియర్ షిఫ్ట్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. గురువారం జనరల్ షిఫ్ట్‌కు వచ్చిన కృష్ణయ్య తోటి కార్మికులతో మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో యాజమాన్యం పిలిచి రిటైర్మెంట్‌కు సంబంధించిన లెటర్ ఇవ్వడం జరిగింది. యూనియన్ రిటైర్మెంట్ ఏజ్ పెంచాలని స్టాపుకు మాదిరిగానే కార్మికులకు సైతం రిటైర్మెంట్ ఏజ్ 61 సంవత్సరాలకు పెంచాలని అడుగుతున్నప్పటికీ యాజమాన్యం ఏ మాత్రం పట్టించుకోకుండా ఈ నెల 31 తర్వాత విధులకు హాజరు కావద్దని డైరెక్టర్ లెటర్ ఇవ్వడంతో అతన్ని తీవ్ర మనస్థాపానికి గురిచేసింది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పరిశ్రమంలోనే ఉన్న డిగేండర్-2 రూములో చానల్ పట్టికి తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయాల్సిన తోటి కార్మికుడు ఈ విధంగా మృతి చెందడం తోటి కార్మికులను కలిచి వేసింది. కార్మికుడి ఆత్మహత్యకు పూర్తి బాధ్యత పిటిఎల్ డైరెక్టర్ సాధు సుందర్, రామ్ శ్రీధర్ రెడ్డి వహించాలని, బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం అందజేయాలని సీఐటీయూ యూనియన్ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి. పాండు రంగారెడ్డి. మాణిక్యం. నాగేశ్వర రావు డిమాండ్ చేశారు. కార్మికుడి కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారంతో పాటు ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




ఆడపడుచులకు కుట్టు మిషన్ల పంపిణీ



నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామంలో గురువారం కుట్టుమిషన్లను గ్రామ ఆడపడుచులకు ట్రైనింగ్ సెంటర్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ హైదరాబాద్ బ్రాంచ్ వారు ఆడపిల్లల కోసం టైలరింగ్ కోసం వినూత్నమైన కార్యక్రమాన్ని చేపట్టారు. కుట్టుమిషన్ల కోసం ఎంపీటీసీ ప్రభాకర్ రెడ్డి సర్పంచ్ దోమడుగు శంకర్ పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే స్పందించి తక్షణమే ఆడపిల్లలకు అండగా ఉండాలని నాలుగు కొత్త కుట్టు మిషన్లను వారికి ఇప్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్,మాజీ వార్డ్ మెంబర్ బాలయ్య, నాయకులు జైపాల్, కుర్మా మల్లేష్, చంద్రయ్య, బొడ్డు వెంకటేష్, గ్రామ కమిటీ టీఆర్ఎస్ అధ్యక్షుడు పెద్దంగాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ



సంగారెడ్డి

శుక్రవారం 3 మార్చి 2023

సామాజిక తనిఖీ ప్రారంభం



నవ తెలంగాణ-న్యాల్ కల్

ఉపాధి హామీ పథకంలో మండలంలో చేపట్టిన పనులను సామాజిక తనిఖీ చేస్తున్నట్లు ఎస్ఆర్పీ కొండల్ తెలిపారు. గురువారం గ్రామ పంచాయతీలలో చాల్కి, రేజింతల్, వడ్డి, అమీరాబాద్, మిర్జాపూర్ (బి), ముంగి 18 గ్రామలలో సామాజిక తనిఖీ బృందం చేపట్టినట్లు తెలిపారు. మండలంలో 3 సంవత్సరాలో 11 కోట్ల 70 లక్షలు పనులు జరిగినట్లు ఎస్ఆర్పి పేర్కొన్నారు జరిగిన పనులను గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో చేసిన వాటిని కూలీలు ఎంత పని చేశారు. ఎంత డబ్బులు చెల్లింపులు , పూడికతీతలు , వైకుంఠధామం , కల్లాల , తనిఖీ చేపట్టారు. గ్రామాల సర్పంచులు కుతుబుద్దీన్ , నిర్మలా జగనాథ్ రెడ్డి , స్వరూప నరసింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రాంప్రసాద్, తనిఖీ బృందం అనిత, ఉపాధి సిబ్బంది నసీర్ ఉన్నారు.

విద్యార్థినుల మరణాలకు కారకులైన వారిని శిక్షించాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్

విద్యార్థినుల మరణాలకు కారకులైన వారిని శిక్షించాలని కోరుతూ నారాయణఖేడ్‌లోని అంబేద్కర్ కూడలిలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో కొవ్వత్తులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు కాశినాత్ జాదవ్, జిల్లా కార్యదర్శులు యేషప్ప, నరేష్,అనురాధ జిల్లా కమిటీ సభ్యులు హరీసింగ్,రాజు, రాములు,విష్ణు,సర్దార్, ఏసుదాస్,విఠల్, శాంతిబాయి, నాయకులు మారుతీరావు, పంచాక్షరి,రాజకుమార్, శ్యంరావు, శ్రీనివాస్, సంజీవ్ కుమార్, సైమన్,రవి కుమార్, రాజుదాస్, మారుతి,సిద్ధయ్య, గోవింద్, నర్సింలు,చందర్, అర్చన,అరుణ పాల్గొన్నారు.

పేదింటి పెళ్లికి పుస్తె మట్టెల పంపిణీ

నవతెలంగాణ జిన్నారం

జిన్నారం మండలం పరిధిలోని పారిశ్రామిక ప్రాంతమైన గడ్డపోతారం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం వడ్డే మల్లయ్య కూతురు మైసమ్మ వివాహానికి పుస్తె మెట్టెల ను గురువారం గడ్డపోతారం గ్రామపంచాయతీ సర్పంచ్, పులిగిల్ల ఫౌండేషన్ అధినేత ,పుల్లగిల్ల ప్రకాశం చారి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవ కార్యక్రమాలలో గొప్పతృప్తి ఉంటుందన్నారు.ఈ సందర్భంగా మల్లయ్య కుటుంబీకులు ప్రకాశం చారి కి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా బీఆర్ఎస్ నాయకుడి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-పుల్కల్

బీఆర్ఎస్ పార్టీ పుల్కల్ మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బేకరీ రవికుమార్ జన్మదిన వేడుకలను అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ క్యాంపు కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయనకు శాలువా పూలమాలతో సన్మానించారు. భారీ కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు మిఠాయిలు తినిపించుకున్నారు. అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, ఆత్మ కమిటీ పుల్కల్ మండల అధ్యక్షులు యాదగిరి రెడ్డి బి ఆర్ ఎస్ పుల్కల్ మండల అధ్యక్షులు మాచర్ల విజయ్ కుమార్ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు నరసింహారెడ్డి పాల్గొన్నారు

సయ్యద్ రిజ్వాన్ ఖాద్రీకి ఘన సన్మానం

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ జమియాత్ ఉలేర్వేమా బ్రాంచ్‌లో హి జమియాత్ ఉలేర్వేమా తరపున ఖిలాఫేట్ వారసత్వాన్ని స్వీకరించినందుకు సయ్యద్ షా రిజ్వాన్ ఖాద్రీ జనీష్, సజ్జదా నాషిన్ దర్గా హజ్రత్ సయ్యద్ అబ్దుల్ అజీజ్ ఖాద్రీ షహీద్ బగ్దాదీ లను గురువారం ఘనంగా సన్మానించారు. గురువారం పట్టణంలోని శాంతి నగర్ జమియత్ ఉలేమా కార్యాలయంలో జమీయత్ ఉలేమా హింద్ పట్టణ అధ్యక్షుడు మౌలానా హఫీజ్ అబ్దుల్ ముజీబ్ ఖాస్మీ ఇమామ్, ఖతీబ్ జామా మసీద్ జహీరాబాద్‌లు శాలువా కప్పి పూలమాలలు వేసి అభినందించారు. కార్యక్రమం లో మౌలానా ముఫ్తీ అబ్దుల్ సబూర్ ఖాస్మీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ముఫ్తీ ఖలీల్ అహ్మద్ ఇమామ్ మదీనా మజీద్ ప్రధాన కార్యదర్శి, హఫీజ్ అక్బర్ ఖాజాన్, అబ్దుల్ ఖాదిర్ ఎంఎం మెడికల్ సెక్రటరీ, ముహమ్మద్ షంషుద్దీన్, మెహబూబ్ ఘోరీ, షేక్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

కేజేఆర్‌కు నివాళి

నవతెలంగాణ-ఐడీఏ బొల్లారం

మాజీ వార్డు సభ్యులు కొత్వాల్ జయరామిరెడ్డి 16వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. జయరాం రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. కేజేఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం జయరాం రెడ్డి నాలుగో కుమారుడు ఆనంద్ కృష్ణారెడ్డి తనయుడు జూనియర్ జయరాం రెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కొత్వాల్ రామకృష్ణారెడ్డి, హరిక్రిష్ణా రెడ్డి, ఆనంద్ కృష్ణారెడ్డి, సంపన్న కృష్ణారెడ్డి తోపాటు కుటుంబ సభ్యులు, కేజేఆర్ అభిమానులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ- కొండాపూర్

కొండాపూర్ మండలం కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ గురువారం సంగారెడ్డి ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్ రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా ఇంద్రారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రభుదాస్, జనరల్ సెక్రెటరీగా జి.నర్సింలుగా నియమించారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు ప్రభు, కొండాపూర్ మండలం ఎంపీటీసీ నరసింహారెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సునీల్, రామకృష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ అనంత పద్మ స్వామి కల్యాణం

నవతెలంగాణ రామచంద్రాపురం

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమెలలో బుధవారం రాత్రి నిర్వహించిన శ్రీ లక్ష్మీ అనంత పద్మ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు, కల్యాణ మహోత్సవం వేలాది మంది భక్తుల సమక్షంలో వేద మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా జరిగాయి. పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తెల్లాపూర్ చైర్మన్ లలితా సోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-ఐడీఏ బొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన రబ్బాని పాషా అనారోగ్య కారణాలతో బాధపడుతున్నారు. బొల్లారం ఎన్ఎంఆర్ సభ్యులు బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణ సాయం కింద రూ.5 వేల ఆర్థిక సహాయం చేశారు. అందుకు వారి కుటుంబ సభ్యులు మధుకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బొల్లారం ఎంఎంఆర్ సభ్యులు మచ్చ శ్రీనివాస్, అన్వర్,మంకు రాజు,జిన్నారం సురేష్, కాజిపల్లి రాజు, నాయి కోటి రమేష్, మహమ్మద్ ఖాసిం, మహమ్మద్ ఫిర్దోసు, ఆజాం భాయ్, షేక్ ముబారక్, జావిద్ భాషా, యాకుబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.



పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవ తెలంగాణ - పటాన్ చెరు

కేంద్ర ప్రభుత్వం మరోసారి గ్యాస్ ధరలు పెంచి మహిళలను, పేదలను, మధ్యతరగతి వారిపై మోయలేని భారం మోపడం దారుణమని సీఐటీయూ జిల్లా కోశాధికారి నాయిని నర్సింహారెడ్డి విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ పటాన్‌చెరు జాతీయ రహదారిపై కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల జేబులు కొట్టి మిత్రులకు పంచిపెట్టే విధంగా బండ బాదుడు మళ్లీ మొదలు పెట్టాడు మోడీ అని ఆరోపించారు. సామాన్యుల నడ్డి విరిచేలా గృహ అవసర వాణిజ్య వినియోగ సిలిండర్లపై మోయలేని భారం మోపడం సిగ్గుచేట నాకు న్నారు. విమాన ఇంధన ధరలు తగ్గించి సామాన్యులు వాడే గ్యాస్ ధర పెంచడం ఏమిటని మండిపడ్డారు. పేదలను ఆదుకునే దేవుడు మోడీ అని ప్రచారం చేసే బిజెపి నాయకులు వెంటనే స్పందించి ధరలు తగ్గించే విధంగా ఒత్తిడి తేవాలని ఆయన అన్నారు. గ్యాస్ ధరల పెంపుతో సిలిండర్ ను చూస్తూనే మహిళల కళ్ళల్లో నీళ్లు తిరుగుతున్నాయని అన్నారు. ప్రధాని మోదీ పేద ప్రజలకు అత్యంత దుర్మార్గమైన శత్రువన్నారు. కేంద్ర ప్రభుత్వ అసమర్ధ విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు, కర్షకులు, మహిళలను పెద్ద ఎత్తున సమీకరించి ఆందోళనలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్రీధర్, మని రాజు, వెంకటేశ్వరరావు, నాయుడు, రామ్ చందర్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని సీపీఐ ధర్నా



నవ తెలంగాణ-సదాశివపేట

కేంద్ర ప్రభుత్వం ఎల్పిజి సిలిండర్‌పై రూ.50, కమర్షియల్ సిలండర్‌పై రూ.350 పెంచించడాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి పి.వినోద మాట్లాడుతూ 2014లో యూపీఏ హయాంలో సిలిండర్ ధర రూ.420 ఉంటే బీజేపీ గగ్గోలు పెట్టిందని, అదాని చేసిన నష్టాన్ని పూడ్చుకోవడం కోసమే కేంద్ర ప్రభుత్వం నేడు సామాన్యుడిపై మరింత భారం మోపిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు సాదిక్ అలీ, ఎండి యాకుబ్ అలీ. పూలమ్మ, లక్ష్మి,అనసూయ, రమేష్, రాధిక, రాజమ్మ, రజియా బేగం ,సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ప్రజలకే పంచాలి



సీపీఐ(ఎం) పటాన్‌చెరు ఏరియా కమిటీ కార్యదర్శి నరసింహారెడ్డి

నవ తెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ భూములను కాపాడి ఇల్లు లేని వారికి ఇవ్వాలని సీపీఐ(ఎం) పటాన్‌చెరు ఏరియా కమిటీ కార్యదర్శి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈరోజు సుల్తాన్ పూర్ గ్రామంలో ఇళ్ల పట్టాలు పొందిన, ఇల్లు లేని పేదలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుల్తాన్ పూర్ గ్రామంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు ఉన్నాయని, భూదాన్ భూములు ఉన్నాయని కానీ ఇప్పటికే వాటిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయవేత్తలు పెద్ద ఎత్తున కబ్జాలు చేసి అమ్ముకున్నారని విమర్శించారు. పేదలకు పట్టాలు ఇచ్చిన స్థలాలు చూపించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. పెద్దలకు ఒక న్యాయం పేదలకు ఒక న్యాయం సరైంది కాదని అన్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారినీ, అమ్ముకున్న వారిని వదిలిపెట్టి, పట్టాలు పొందిన పేదలు గుడిసెలు వేసుకుంటే తొలగిస్తున్నారని ఇది సరైనది కాదన్నారు. గ్రామంలోని ప్రభుత్వ భూమిని పూర్తిస్థాయిలో సర్వేలు నిర్వహించి ఆక్రమించిన వారి నుండి స్వాధీనం చేసుకొని బోర్డులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాదయ్య ,అశోక్, నాయకోటి యాదయ్య, మంగళ యాదయ్య అంజయ్య ,కిష్టయ్య, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వంటగ్యాస్ పెంపుదలకు వ్యతిరేకంగా ధర్నాను జయప్రదం చేయండి

నవతెలంగాణ-జోగిపేట



కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను పెంచి ప్రజలపై మోయలేని భారాలను వేస్తోందని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. ఈ నెల 3న బంధువులు నియోజకవర్గం కేంద్రమైన జోగిపేట పట్టణంలో నియోజకవర్గ పరిధిలో ఆయా మండలాలలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు గ్రామంలో పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఉదయం 9 గంటలకు ఈ నిరసన ధర్నా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ జగన్ మోహన్ రెడ్డి, అందోల్ ఎంపీపీ జోగు బాలయ్య, జోగుపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య ఆత్మ కమిటీ చైర్మన్ యాదగిరి రెడ్డి, మాజీ జెడ్పిటిసి నారాయణ, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు లింగాగౌడ్, నరసింహారెడ్డి, వరం అధ్యక్షులు వీరారెడ్డి, పుల్కల్ మండల అధ్యక్షులు శివకుమార్, జోగిపేట పట్టణ అధ్యక్షులు సార శ్రీధర్, మాజీ అధ్యక్షులు వెంకటేశం, నాయకులు అనిల్ రాజ్, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

జిన్నారంలో గండ్ర దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ జిన్నారం

టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిపై దాడికి నిరసనగా మండల కేంద్రమైన జిన్నారంలో గురువారం కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్, సోలక్ పల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి లు మాట్లాడుతూ పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి పై దాడి చేయడం హేయ నీయమైన చర్య అన్నారు. గండ్రాకు రాబోయే రోజుల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారని వారు హెచ్చరించారు. గండ్ర వెంకట రమణారెడ్డికి దమ్ము ధైర్యం ఉంటే కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం మీద గెలిచిన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దిన్నారమల్ల పరిషత్ అధ్యక్షులు దమ్ముకొని రవీందర్ గౌడ్, సోలక్ పల్లి సర్పంచ్ దాసరి శ్రీకాంత్ రెడ్డి,గడ్డ పోతారం ఎంపీటీసీ జనాభాయ్,ఉట్ల ఉపసర్పంచ్ జింకల రవి, పట్లోళ్ల మహేందర్ రెడ్డి, అన్నారం సాయిలు, పల్నాటి భాస్కర్,యాదగిరి యాదవ్ ,యనగండ్ల నరేందర్, గంగురాజు, జింకల మధు, నిరుడు సాయి, వడ్ల నరేష్,అన్నారం శ్రీకాంత్, జానీ, నరేష్ యాదవ్, మీసాల బిక్షపతి, భాస్కర్ పాల్గొన్నారు.

ఎన్ఎంఆర్ యువసేన కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఎంఎస్ఆర్ యువసేన కార్యకర్త, పుట్నాల వెంకటయ్య హఠాత్తుగా మరణించారు. గుమ్మడిదల ఎంఎన్ఆర్ యువసేన సభ్యుల ద్వారా గురువారం సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిట్కుల్ సర్పంచ్ నీలం మధు పదివేల ఆర్థిక సాయం గుమ్మడిదల ముదిరాజ్ సంఘం ఎం ఎస్ ఆర్ యువసేన సభ్యుల చేత అందించారు. కార్యక్రమంలో అధ్యక్షులు గ్యారల మల్లేష్ ముదిరాజ్, తుజాల్ పూర్ వీరేశ్ ముదిరాజ్, బుద్దుల అశోక్ ముదిరాజ్, కనకరాజు ముదిరాజ్, గుమ్మడిదల గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు దేవుని చెరువు నర్సింలు ముదిరాజ్, జిన్న నాగయ్య, కాశబోయిన ఆంజనేయులు, ఆరేటి ధనుంజయ్, డాకూరి శ్రీశైలం, తుడుం శ్రీనివాస్, జిన్న శంకర్, నారాయణ స్వామి, బుడగజంగాల సంఘం అధ్యక్షులు ఆంజనేయులు, శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బరిలో సతీష్ ముదిరాజ్ నిలబడాలి

నవ తెలంగాణ కొండాపూర్

జనం కోసం శ్రమించే మంచి మనసున్న సతీష్ ముదిరాజ్ సంగారెడ్డి అసెంబ్లీకి పోటీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తాజొద్దీన్ అన్నారు. గురువారం మల్కాపూర్ చౌరస్తాలోని సతీష్ ముదిరాజ్ నివాసానికి సంగారెడ్డి నియోజకవర్గంలోని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యదర్శులు, అభిమానులు తరలివచ్చారు. సతీష్ ముదిరాజ్ సంగారెడ్డి అసెంబ్లీకి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలంటూ అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ముదిరాజ్ ముద్దుబిడ్డ జనం కోసం సేవ చేస్తూ ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తూ పేదల కోసం శ్రమిస్తున్న సతీష్‌ను జనం ఎమ్మెల్యేగా చూడాలనే కోరుకుంటున్నారని ముదిరాజ్ కుల పెద్దలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్స్ కోసం ప్రయత్నం చేయాలని యువకుల సతీష్ ముదిరాజులు కోరారు. సీపీఐ నాయకులు సైతం మద్దతు తెలిపారు. రాజకీయాల్లోకి రావాలని సంగారెడ్డి అసెంబ్లీ లో సతీష్ ముదిరాజ్‌కు పూర్తి మద్దతు ఉంటుందని సీపీఐ నేతలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిలర్ సభ్యులు షఫీ అహ్మద్ ముదిరాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేడియాలజిస్ట్, రేడియో గ్రాఫర్ పోస్టులకు ఈ నెల 9న వాక్ఇన్ ఇంటర్వ్యూలు

జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రేడియాలజిస్ట్, రేడియో గ్రాఫర్ పోస్టులకు ఈ నెల 9న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ గురువారం తెలిపారు.ేండియాలజిస్ట్ పోస్టు ఒకటి, రేడియో గ్రాఫర్ పోస్టులు రెండు కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు తెలిపారు. రేడియో గ్రాఫర్ పోస్టులలో ఒకటి పురుషులు ఒకటి మహిళలకు కేటాయించడం జరిగిందన్నారు. రేడియాలజిస్ట్ పోస్టునకు రేడియాలజీలో ఎండీ అభ్యర్థులు అర్హులని, వేతనం నెలకు లక్ష రూపాయలని తెలిపారు. ఇట్టి పోస్టునకు అర్హత గలవారు మార్చి 9న ఉదయం 10:30 గంటల నుండి 11:30 గంటల లోపు సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఛాంబర్ లో హాజరు కావాలని సూచించారు. రేడియోగ్రాఫర్ పోస్ట్ నకు డిప్లమో/బీఎస్సీ రేడియోగ్రఫీ/డి ఎం ఐ టి డిప్లమా ఇన్ ఇమేజింగ్ టెక్నాలజీ అభ్యర్థులు అర్హులని తెలిపారు. వేతనం నెలకు 30 వేలు ఉంటుందన్నారు. అర్హత గల అభ్యర్థులు 9న మధ్యాహ్నం 12 గంటల నుండి రెండు గంటల లోపు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెంట్ చాంబర్లో ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు.ఆయా పోస్టులకు సంబంధిత సబ్జెక్టుల్లో మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేసుకోవడం జరుగుతుందన్నారు.అభ్యర్థులు తమ ఒరిజినల్ విద్యార్హతల ధ్రువపత్రాలతో పాటు రెండు సెట్ల జిరాక్స్ ప్రతులతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు.

నేటి నుంచి పటాన్‌చెరులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



నవ తెలంగాణ - పటాన్ చెరు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు పటాన్‌చెరు పట్టణంలో మహిళా దినోత్సవ సంబరాలు నిర్వహించబోతున్నట్లు పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం పటాన్ చెరు పట్టణంలోని ఎంపీపీ సమావేశ మందిరంలో నియోజకవర్గ మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమాల వివరాలను వెల్లడించారు.గత 20 సంవత్సరాలుగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పటాన్ చెరు నియోజకవర్గ స్థాయి మహిళా దినోత్సవ సంబరాలు నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. ఈ సంవత్సరం మూడు రోజులపాటు కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు.3వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు మైత్రి మైదానంలో క్రీడా పోటీలు ప్రారంభించినట్లు తెలిపారు.6వ తేదీ సోమవారం జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో నియోజకవర్గ మహిళలను భాగస్వామ్యం చేస్తూ వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సమస్యలపై ప్రముఖులచే అవగాహన సదస్సులు, విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు.పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని అన్ని స్థాయిల మహిళా ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న మహిళ ఉద్యోగినులు, విద్యార్థినిలు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో ఎంపీపీలు ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, జెడ్పిటిసి సుప్రజా వెంకట్ రెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ చైర్మన్ లలితా సోమిరెడ్డి, బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజా బాల్ రెడ్డి, రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, మెట్టు రమాదేవి కుమారి యాదవ్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఆల్ ఇండియా మజ్లిస్ ఇత్తెహాద్ ముస్లిమీన్ వ్యవస్థాపక దినోత్సవం



నవతెలంగాణ-జహీరాబాద్

ఎంఐఎం పార్టీ 65వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు గురువారం 65వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జహీరాబాద్ గెస్ట్ హౌస్ ఎదుట జహీరాబాద్ ఆల్ ఇండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధ్యక్షులు ముహమ్మద్ అత్తర్ అహ్మద్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. శాంతినగర్‌లో వార్డ్ అధ్యక్షులు సయ్యద్ రాషెద్‌తో కలిసి పార్టీ జెండాను ఎగురేశారు. తర్వాత రాంనగర్ గాంధీ నగర్‌లో వార్డ్ బాధ్యులు మహమ్మద్ రఫీ తో కలిసి జెండా ఆవిష్కరణ చేశారు. తమ్మడ్ పల్లి, భరత్ నగర్‌లో వార్డ్ బాధ్యులు ముహమ్మద్ నబీ ఆధ్వర్యంలో పార్టీ జెండాను అత్తర్ అహ్మద్ ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మజ్లిస్ పార్టీ ప్రజల కోసం చేసే మంచి పనులను గుర్తు చేస్తూ అసద్ ఉద్దీన్ ఓవైసీ, అక్బర్ ఉద్దీన్ ఓవైసీ ఎప్పుడూ ప్రజల మధ్య ఉంటూ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పురపాలక సంఘం మాజీ వైస్ చైర్మన్ అజ్మత్ పాషా సంయుక్త కార్యదర్శులు మొహియుద్దీన్ ఘౌరీ, ఆమెర్ బిన్ అబ్దుల్లా, హిసామ్ మాస్టర్, షోయెబ్ వివిధ వార్డుల అధ్యక్షులు ముహమ్మద్ అయూబ్, సయ్యద్ రాషెద్, ముహమ్మద్ ముజీబ్, అబ్దుల్ రహీమ్, సయ్యద్ మొహసిన్, ధనాసిరి అధ్యక్షుడు ముహమ్మద్ అక్బర్ సత్తార్ ముహమ్మద్ ఫారూఖ్ కుప్పానగర్ అబ్దుల్ గఫూర్ మ్యెగుడంపల్లి పల్లి అబ్దుల్ వలీ షేఖాపూర్ మాజీద్ పటేల్ గుడ్ పల్లి ముహమ్మద్ లతీఫ్ షా పార్టీ నాయకులు ముహమ్మద్ షఫి, షరీఫ్, అలీమ్, ఫయాజ్ రియాజ్, సమీర్, ఇక్బాల్, అబ్దుల్ బారీ, ఖదీర్, ఖలీల్, జాఫర్, ఆమెర్, జావీద్, షేక్, రఫీ, సమీ పాల్గొన్నారు.

5న గురుకులాల సీవోఈ, యూజీ ప్రవేశ పరీక్షలు

నవతెలంగాణ-జహీరాబాద్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్, డిగ్రీ కళాశాలలో 2023 -24 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశపరీక్షలు ఈ నెల 5న ఆదివారం నిర్వహిస్తున్నట్లు గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ ఎం.భీమయ్య గురువారం తెలిపారు. ఇంటర్ ప్రవేశ పరీక్ష సమయం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, డిగ్రీ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాలు సంగారెడ్డి జిల్లాలో సీవోఈ ఇంటర్‌కుగాను ఇస్నాపూర్, చిట్కుల్, హత్నూర, అందోల్, కొండాపూర్ బుదేరా, రంజోల్‌లో కలవని ఇందులో 4325 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, యూజీ సెట్ డిగ్రీ ప్రవేశానికై పరీక్ష కేంద్రాలు ఆర్‌సీవో పరిధిలోని మెదక్, కొల్చారం , బుదేర, ఇస్నాపూర్ , చిట్కుల్ లలో నిర్వహించబడును ఈ పరీక్షకు గాను 1738 మంది విద్యార్థులు అవుతున్నారని తెలిపారు.

కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే జీఎంఆర్ సాయం

నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండలం మంగంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పంబాల ఆంజనేయులు అనారోగ్యంతో మృతి చెందడంతో సదరు కుటుంబానికి పటాన్చెరు నియోజకవర్గం సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. ఆంజనేయులు మృతి చెందిన విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్లడంతో మానవతా హృదయంతో స్పందించిన ఆయన తన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి ద్వారా 15 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.గురువారం నాడు ఆ నగదును ఉప సర్పంచ్ నక్క నాగరాజు,వార్డు సభ్యులు కదిర్ గ్రామ అధ్యక్షుడు వెంకటేష్,ముదిరాజ్ సంఘ%శీ% అధ్యక్షుడు పంబాల రతన్ కుమార్ లు అందించారు.ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, నరేష్, శ్రీకాంత్, రాములు జీఎంఆర్ యువసేన తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలు నేటి తరాలకు స్ఫూర్తిదాయకం : ఎమ్మెల్యే



నవతెలంగాణ-రామచంద్రాపురం

మహనీయుల జీవితాలు నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు గ్రామ ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేయనున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటు భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పూర్తి పారదర్శకతతో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున మహనీయుల విగ్రహాలను సొంత నిధులతో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని యువతకు సూచించారు. మాజీ ఎంపీటీసీ నర్సింహా, కౌన్సిలర్ మయూరి రాజు గౌడ్ పాల్గొన్నారు.

ఆర్కిటెక్చరల్ ఫొటోగ్రఫీపై వెబినార్

నవతెలంగాణ - పటాన్‌చెరు

గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ హైదరాబాద్-విశాఖపట్టణంలు సంయుక్తంగా 'ఆర్కిటెక్చరల్ ఫొటోగ్రఫీలో కెరీర్' అనే అంశంపై మార్చి 5, 2023న (ఆదివారం) ఉదయం 11.00 నుంచి 12.30 గంటల మధ్య వెబినార్‌ను నిర్వహించనున్నట్టు డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్ కుమార్ వెల్లడించారు. తాము గత ఏడాది నుంచి వరుసగా నిర్వహిస్తున్న వెబినార్లలో భాగంగా దీనిని ఏర్పాటు చేస్తున్నట్టు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.ఫొటోగ్రఫీలో అవార్డు గ్రహీత, శ్రీనాగ్ పిక్చర్స్ వ్యవస్థాపకుడు బీ.ఆర్.ఎస్.శ్రీనాగ్ ఈ వెబినార్ లో ముఖ్య వక్తగా పాల్గొంటారని ఆయన తెలియజేశారు. ఇతర వివరాల కోసం అసోసియేట్ ప్రొఫెసర్ కె. నాగేశ్వరరావు 98666 19639ను సంప్రదించాలని సూచించారు.

కొల్లూరు రోడ్డు ప్రమాదంపై ఎమ్మెల్యే జీఎంఆర్ దిగ్భ్రాంతి



నవతెలంగాణ-రామచంద్రాపురం

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు ఔటర్ రింగ్ రోడ్డు వద్ద జరిగిన లారీ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడం పట్ల ఎమ్మెల్యేగూడెం మహిపాల్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సమాచారం తెలిసిన వెంటనే హుటాహుటినా సంఘటన స్థలానికి చేరుకొని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. రోజు కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబం లో ముగ్గురు వ్యక్తులు నిద్రలోనే ప్రమాదానికి గురై, మృతి చెందడం తనను తీవ్రంగా కలిచి వేసిందన్నారు. త్వరితగతిన పోస్టుమార్టం పూర్తి చేసి, స్వస్థలాలకు పంపించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.50 వేల తక్షణ సహాయం అందించారు. ప్రభుత్వం తరపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



అందత్వ నివారణకే కంటి వెలుగు

ఎమ్మెల్యే మదన్ రెడ్డి



నవతెలంగాణ-వెల్దుర్తి : అందత్వాన్ని పోగొట్టి వెలుగులు నింపడానికి కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలో కుక్కునూరు గ్రామపంచాయతీ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం కుకునూరులో స్థానిక సర్పంచ్ ప్రీతి మహేందర్ రెడ్డి, జెడ్పిటిసి రమేష్ గౌడ్ ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి, మెడికల్ అధికారి సౌజన్య ఆధ్వర్యంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు కంటి వెలుగు కార్యక్రమం దేశానికి ఆదర్శమని కొనియాడారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గంగపుత్ర సంఘం యాదవ సంఘం కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. తహసీల్దార్ నాగవర్ధన్ ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ ఆత్మ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి కోఆప్షన్ మన్సూర్‌తో పాటు ప్రజాప్రతినిధులు అధికారులు ప్రాథమిక వైద్య ఆరోగ్య సిబ్బంది అంగన్వాడి టీచర్లు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా క్రికెట్ టోర్నమెంట్



నవతెలంగాణ- కొల్చారం

మండల పరిదిలోని పైతర గ్రామంలో గత ఐదు రోజులుగా కొనసాగుతున్న టీటీసీపీఎల్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్ -1 పోటీలు ఉత్సాహభరితంగా కొనసాగాయి. పైతర, కోనాపూర్, తుక్కాపూర్ గ్రామాలకు చెందిన యువకులు ఈ క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. గురువారం చివరి రోజు ఫైనల్ మ్యాచ్ లో ఆర్జీ వారియర్స్, ద లెవన్ కింగ్స్ మధ్య పోటీ జరగగా, ద లెవన్ కింగ్స్ విజేతగా నిలిచింది. క్రీడాకారులకు, విజేత, రన్నరప్ జట్లకు ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీపీ మంజుల, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు వాకిటి శశిధర్ రెడ్డి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షుడు సంతోష్ రావు, ఎంపీటీసీ ఎల్లయ్య, బీఆర్ఎస్ పార్టీ మండల యువ నాయకుడు రవితేజ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెల్మకన్నె ఎల్లేశం, ఆత్మకమిటీ డైరెక్టర్ దొడ్ల ఆంజనేయులు, శ్రీశైలం, కాశీనాథ్, లింగంపల్లి మల్లేశం, పశుపతి, నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఇఫ్కో డైరెక్టర్



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు యాడారం నారా గౌడ్, కన్న రమేష్ గౌడ్‌లు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా గురువారం ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి ఇరువురి కుటుంబాలను పరామర్శించారు. వారి మెరుగైన వైద్యం కొరకై డాక్టర్ తో మాట్లాడి వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట సొసైటీ చైర్మన్ బాదే చంద్రం, బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ ఎండి గౌస్, దుబ్బ రాజా గౌడ్, వెంకటస్వామి గౌడ్,అంజా గౌడ్, కేశల యాదగిరి,శంకరయ్య, కుమ్మరి నారాయణ, పర్శాగౌడ్,బాలరాజు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



నవతెలంగాణ-టేక్మాల్ : విద్యార్థులే ఉపాధ్యాయులై ఒకరోజు పాఠాలను బోధించారు. ప్రాథమిక పాఠశాల ధనురాలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌గా రంజిత్ కుమార్, డీఈఓగా సదానంద్, ఎంఈఓ గా ఎండి అప్సియా సుల్తానా, ప్రధానోపాధ్యాయులుగా సంజన, ఉపాధ్యాయులుగా ముసాన, సంధ్య, అక్షర, అంకిత, మహేశ్వరి, హారిక, కళ్యాణి, అశ్విని, విక్రం, అఖిల్, ప్రణయ్, వంశీ,రామ్ చరణ్, జస్వంత్, వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లావణ్య, ఉపాధ్యాయ బృందం ప్రకాష్, భూపాల్, భాస్కర్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-పాపన్నపేట : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడు. ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుర్తివాడ గ్రామానికి చెందిన మన్నె నర్సింహులు (72) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 21న నాగసాన్ పల్లి శివారులో ఉన్న ఓ ఫంక్షన్ హాలులో విందులో పాల్గొనేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. సాయంత్రం సమయంలో నర్సింలు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు, శరీరానికి గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తదుపరి చికిత్స నిమిత్తం 108 వాహనంలో మెదక్ ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. భార్య ఇందిర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా, వంటా వార్పు

- అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే. మల్లికార్జున్

నవతెలంగాణ-మెదక్ రూరల్

ఐసీడీఎస్‌లో పని చేస్తున్న అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 3 రోజులు సమ్మె నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా 2వ రోజు గురువారం మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు టెంటు వేసి ధర్నా , వంట వార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లికార్జున్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐసీడీఎస్‌ని పూర్తిగా నిర్వీర్యం చేయాలని కుట్ర చేస్తుందని మండిపడ్డారు. కేంద్రం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను ముందుకు తెచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రూపాలలో తమని వాడుకొని పనులు తీసుకుంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా చెవిటి వాడిముందు శంఖం ఉదినట్లుగా ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం పెంచిన వేతనాలను టీచర్ 1500 , మినీ టీచర్ కు 1250 , ఆయాలకు 750 లు పెంచితే రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకుండా వాడుకోవడం సిగ్గుచేటని అన్నారు . దేశంలో మతశిశు మరణాలు తగడంలో అంగన్వాడీల కృషి లేదా అని ప్రశ్నించారు. 26 రకాల పనులు ఆన్లైన్‌లో చేయాలంటే పెద్ద తలనొప్పిగా మారిందని గుర్తుచేశారు. వెంటనే ఆన్లైన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు గ్రాడ్యుటి అమలు చేయాలని ప్రభుత్వ టీచర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. సమస్యలు పరిష్కరించని యెడల పెద్ద ఎత్తున్న ఇంకా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు అన్నపూర్ణ , కె. నర్సమ్మ , సీఐటీయూ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు మహేందర్ రెడ్డి , బస్వరాజు , ఉపాధ్యక్షులు కడారి నాగరాజు , సహాయ కార్యదర్శి బలమని అంగన్వాడీ నాయకులు సువర్ణ , వరలక్ష్మి , మంజుల , ధనలక్ష్మి , సుమిత్ర , నిల , పద్మ , సీతారామ లక్ష్మీ , శమల , వెంకట్ లక్ష్మీ , అంగుర , రామ , రాజమని నాగలక్ష్మి , స్వప్న తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ ధరలు తగ్గించాలని బీఆర్ఎస్ నాయకుల ధర్నా



నవతెలంగాణ-మెదక్ రూరల్

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను పెంచినందుకు నిరసనగా మెదక్ జిల్లా బారాస అధ్యక్షురాలు ఎం పద్మ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మెదక్ పోస్ట్ ఆఫీస్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ మోదీ అధికారంలోకి రాకముందు గ్యాస్ సిలిండర్ ధర 400 రూపాయలు ఉంటే, మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 1250 రూపాయలకు పెరిగిందన్నారు. దేశంలో పెద్దన్న పాత్ర పోషిస్తూ రాష్ట్రాలకు ఏదైనా ఇబ్బంది ఉంటే రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థిక సహాయం చేసే విధంగా కేంద్రం ఉండాలి కానీ ప్రజలను రెచ్చగొడుతూ మతకల్లోలను సృష్టించే విధంగా ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సింగరేణి, రైల్వే, ను ఆర్టీసీని, ప్రైవేటీకరణ చేయడంలో ఆంతర్యం ఏంటో దేశ ప్రజలందరికీ అర్థమయిందన్నారు. ఆదాని, అంబానీ కావాలా వారు సంపాదించే సొమ్ములో వాటా కావాలా అని మోదీని ప్రశ్నించారు. 2016 రూపాయలు ముఖ్యమంత్రి పెన్షన్ ఇస్తుంటే అందులో కేంద్ర ప్రభుత్వం ఇచ్చేది 200 రూపాయలు మాత్రమేనని అది కూడా కేవలం 6 లక్షల మందికి మాత్రమే ఇస్తే ముఖ్యమంత్రి కేసీఆర్ 50 లక్షల మందికి ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు యం.లావణ్య రెడ్డి,ఆత్మ కమిటీ చైర్మన్ అంజ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు జయరాజ్, సంయోద్దీన్,కో ఆప్షన్ నెంబర్ సయ్యద్ ఉమర్, మెదక్ పిఎసిఎస్ చైర్మన్ హనుమంత్ రెడ్డి, నాయకులు రాగి అశోక్,ప్రభు రెడ్డి,మధు, సతీష్ రావు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేగుంట : చేగుంట రహదారిపై గులాబీ శ్రేణులు గురువారం పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని నిరసన, ధర్నాలు నిర్వహించారు. మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి ఈ ధర్నాలో పాల్గొని, ప్రధానమంత్రి మోడీకి వ్యతిరేక నినాదాలు చేశారు. 2014లో అచ్చే దిన్ అంటూ అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ నిత్యావసర ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ..సచ్చే దిన్‌గా మార్చారని మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా గ్యాస్ ధరలు పెంచుతూ మహిళలకు కానుక ఇచ్చాడని, వంట యాదికి వస్తేనే, మహిళలకు కన్నీళ్లు వస్తున్నాయని, కట్టెల పొయ్యే దిక్కవుతుందని ఆయన పేర్కొన్నారు. రైతు ఆదాయం రెట్టింపు చేస్తామని, ఎరువుల, డీజిల్, పెట్రోల్, ధరలు రెట్టింపు చేసి అన్యాయం చేశారన్నారు. బీజేపీ ప్రభుత్వం పేదలకు శాపంగా మారిందని కార్పొరేట్ వ్యవస్థకు మద్దతు పలుకుతూ పేదల నడ్డి విరుస్తుందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాసుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు ఎర్ర యాదగిరి, మెదక్ జిల్లా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రంగయ్య గారి రాజిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్ కుమార్, నాయకులు మైలారం రామచంద్రం, బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి నదీమ్, మహేష్, సోమ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్ మొక్కల లక్ష్యాన్ని చేరుకోవాలి

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

నవతెలంగాణ-కొండపాక

ఆయిల్ ఫాం మొక్కల పెంపకం తప్పనిసరిగా ఈ సంవత్సరం లక్ష్యాన్ని చేరుకునేలా పని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్ అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాలో ఆయిల్ ఫాం సాగుపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఆయిల్ ఫ్రెడ్ కార్పొరేషన్ అధికారులు, మండల ఎఓ, ఎడిఓ, ఎఈఓ అందరితో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్ ఫాం సాగులో పురోగతి రావాలన్నారు. రైతుల వద్దకు వెళ్లి ఆయిల్ సాగుకు ముందుకు వచ్చేలా ప్రేరేపించాలన్నారు. మార్చి 31 లోపు తప్పనిసరిగా లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎఓ, ఎడిఎ, ఎఈఓ లు పర్యటించి ఎంచుకున్న వ్యవసాయ క్షేత్రాన్ని డిడి-పేమెంట్ కాగానే భూమిని చదును చెసి పిట్ మెంట్ మార్కింగ్, ట్రెంచింగ్ చేయించాలన్నారు. ఆయిల్ ఫ్రెడ్ అధికారులు కొఠారి, జైన్, గ్లోబల్, ఇతర కంపెనీలు త్వరగా పరికరాలను సమకూర్చుకోవాలన్నారు. పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఉద్యాన వన శాఖ అధికారి రామలక్ష్మి పాల్గొన్నారు.



గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు

బాల బాలికల హక్కులను కాపాడుదాం

ఎస్సై మధుసూదన్ గౌడ్



నవతెలంగాణ-వెల్దుర్తి

మండల కేంద్రంలో చేరిలా గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి అంగన్వాడి టీచర్ దేవలత ఆధ్వర్యంలో స్థానిక సర్పంచి ఆముద భాగ్యలక్ష్మి ఆంజనేయులు అధ్యక్షతన గురువారం బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఐ మధుసూదన్ గౌడ్ హాజరై మాట్లాడారు. బాల బాలికల హక్కులను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పోలీసులు చేస్తున్న సేవలను ప్రజలకు తెలియజేశారు గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీలు చైర్మన్ గ్రామ సర్పంచి అమృత భాగ్యలక్ష్మి ఆంజనేయులు కన్వీనర్‌గా అంగన్వాడి టీచర్ దేవలత సభ్యులుగా ఈవో బలరాం రెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, ఏఎన్ఎం స్రవంతి, యూత్ అధ్యక్షులుగా సల్ల అశోక్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఇక్కిరి రేణుక, సత్తయ్య, కర్రె మల్లేశం కొనసాగుతారన్నారు. ఈ సందర్భంగా బాలల పరిరక్షణ కమిటీ లో ఉన్న సభ్యులందరూ తమ వంతు బాధ్యతగా బాల బాలికల హక్కులను కాపాడాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మీ సూచించారు. కన్వీనర్ అంగన్వాడి టీచర్ దేవత మాట్లాడుతూ బాల్యవివాలు వరకట్న వేధింపులు బాలబాలిక అక్రమ రవాణా బలవంతం పనులు కిరాణం హొటల్లో మగ్గుతున్న బాలబాలికలను కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు చిన్నారులకు అన్నప్రసాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు లక్ష్మి గౌసియా మంగేశ్వరి దుర్గ నాగమణి గర్భిణీలు బాలింతలు పాల్గొన్నారు

సీఎం సహాయ నిధి పేదలకు వరం

ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి

నవతెలంగాణ-మెదక్ టౌన్



అనారోగ్యాల బారిన పడిన నిరుపేదలకు సీఎం ఆర్ఎఫ్ ద్వారా చేయూత అందిస్తున్నామని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 61 మంది లబ్ధిదారులకు రూ.32,24,500/- విలువ గల చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు అనారోగ్యాల బారిన పడి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది సరైన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక చేయూత అందిస్తున్నామన్నారు. వేలాది మందికి కోట్లాది రూపాయల చెక్కులను అందజేశామన్నారు. నిరుపేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తున్నామన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అదే విధంగా హవేళి ఘనపూర్ మండలం వివిధ గ్రామాలకు చెందిన 14 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను అందజేశారు. మెదక్ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు యం.లావణ్య రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ అంజ గౌడ్, హవేళిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు జయరాజ్, సంయోద్దీన్, కో ఆప్షన్ నెంబర్ సయ్యద్ ఉమర్, హవేళి ఘనపూర్ మండలం వైస్ ఎంపీపీ రాధాకృష్ణ కిషన్ యాదవ్, మెదక్ ఏఎంసీ డైరెక్టర్ సాప సాయిలు, హవేళిఘనాపూర్ ఎమ్మార్వో నవీన్ కుమార్, నిజాంపేట్ మండల ఎంపీపీ సిద్ధిరాములు, రైతుబంధు అధ్యక్షులు సంపత్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, సర్పంచులు యామి రెడ్డి, చెన్నా గౌడ్,నాయకులు రాగి అశోక్, భీమయ్య, ప్రభు రెడ్డి, కిష్ట రెడ్డి, మధు, సిద్ధిరాములు, బాబర్ పటేల్, సతీష్ రావు, మేకల సాయిలు, రాజు, మోహన్, వినోద్, ఫుల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీవీబీ సేవలపై కళాజాత కార్యక్రమం



నవతెలంగాణ-నిజాంపేట : ఏపీజీవీబీ బ్యాంక్ నిజాంపేట శాఖ వారి ఆధ్వర్యంలో దుబ్బాక మండల పరిధిలోని చిన్న నిజాంపేట గ్రామంలో గురువారం కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు యొక్క ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, బ్యాంకు ఇన్సూరెన్స్ స్కీమును, క్రాప్ లోన్ రెన్యువల్ గురించి డిపాజిట్ బ్యాంకు నగదు దాచుకోవడం గురించి సైబర్ నేరాల గురించి మ్యాజిక్ షో ద్వారా ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ మురళీకృష్ణ, క్యాషియర్ పవర్, సర్పంచ్ రచన కైలాస్, బ్యాంకు మిత్ర రవి, గ్రామ కార్యదర్శి మురళి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో రంజిత్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ చైతన్య కార్పొరేట్ విద్యాసంస్థలలో అనేకమంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వం, ఇంటర్ బోర్డు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, నెలకు ఒక విద్యార్థి చనిపోతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. లక్షల రూపాయల ఫీజులు కట్టిన విద్యార్థుల ప్రాణాలతో కార్పొరేట్ విద్యా సంస్థలు చెలగాటం ఆడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతి సంవత్సరం కార్పొరేట్ బ్రాంచ్‌లు పుట్టగొడుగుల్లా పెరుగుతూ ఎలాంటి పర్మిషన్ తీసుకోకుండా విద్యాసంస్థలను నడుపుతూ విద్యార్థుల చావులకు కారణమవుతున్నాయని తెలిపారు. మృతి చెందిన సాత్విక్ కుటుంబానికి నష్టం పరిహారం అందించి, కళాశాల యాజమాన్యంపైన కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థులను ఏకం చేసి కార్పొరేట్ విద్య సంస్థలపై పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో గోనె సాయిరాం, పూర్ణ, రాకేష్ రెడ్డి, చరణ్, అరవింద్ పాల్గొన్నారు.

అజ్జమరి పాఠశాలలో స్వయం పరిపాలన



నవతెలంగాణ-చిలిపిచేడ్ : మండల పరిధిలోని అజమరి పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహిచారు. గురువారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులుగా శ్రీనిధి మండల విద్యాధికారిగా అరవింద్ ఉపాధ్యాయులుగా భూపాల్, బాలరాజ్ అక్షిత్, వైష్ణవి, అవంతి, పావని, నవీన్, మణిదీప్, కావేరి, కీర్తనలు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్ ఉపాధ్యాయులు వెంకట కృష్ణ కనకయ్య షేక్ మదర్, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరస్వామి లు పర్యవేక్షించారు.

4న ఎథిక్స్ పరీక్షలు

నవతెలంగాణ-మెదక్ రూరల్

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 4 న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, 6న ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్‌పై తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సత్యనారాయణ గురువారం కళాశాలల ప్రధానాచార్యులకు విజ్ఞప్తి చేశారు. ఈ పరీక్షను రాయకపోతే ఫైనల్ మెమో రాదని, కాబట్టి గతంలో రాయని విద్యార్థులు కూడా ఇట్టి పరీక్ష తప్పక రాయాలని సత్యనారాయణ సూచించారు.

గ్రంథాలయ అభివృద్ధికి నిధులు మంజూరు

నవతెలంగాణ-చేగుంట



చేగుంట స్టేషన్ రోడ్ లో ఉన్న గ్రంథాలయన్ని సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. అనంతరం భవన నిర్మాణం పనులు పరిశీలించి, గ్రామపంచాయతీ నిధుల నుంచి రూ.2 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గ్రంథాలయ కిటికీలు, చిన్న,చిన్న మరమ్మతులకు, అలాగే మౌలిక సదుపాయాలకు నిధులు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అర్చన , రాజేష్ ఉన్నారు.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-పాపన్నపేట

జీవితంపై విరక్తితో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కుర్తివాడ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్ కుమార్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన సార భాగమ్మ (40) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. గత మూడేళ్లుగా గ్రామానికి చెందిన పుట్నాల విఠల్ అనే వ్యక్తితో సహజీవనం కొనసాగిస్తుంది. గత వారం రోజులుగా విఠల్, భాగమ్మల మధ్య గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో భాగమ్మ జీవితంపై విరక్తి చెంది బుధవారం అర్ధరాత్రి సమయంలో విఠల్ ఇంటి ముందు ఇంటికి ఉండే సిరాకు తాడుతో ఉరి వేసుకుంది. దీంతో అటుగా వెళ్లిన స్థానికులు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం ఆటోలో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిందని చెప్పారు. మృతురాలి సోదరుడు భోగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.



విద్యార్థుల కు క్రీడా దుస్తులు అందజేత



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రంలో గల మోడల్ పాఠశాలలో గల విద్యార్థులకు ముదిరాజ్ సంఘము మండల అధ్యక్షుడు రాగుల రాజు, మండల కోశాధికారి కొంపల్లి శ్రీనివాస్ ఉపాధ్యక్షుడు కర్ణాకర్ విద్యార్థులకు క్రీడాదుస్తులు అందించారు. ఈ సందర్భంగా రాగుల రాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో మాత్రమే కాకుండా క్రీడాల్లో రాణించాలన్నారు. క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడం కోసం మా వంతు సహయాన్ని అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు శ్రద్ధతో చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్లివరాజు, ఉపాధ్యాయులు బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు, ఒత్తిళ్ల వల్లే సాత్విక్ మృతి



- ఏఐపిఎస్‌యూ జిల్లా నాయకులు అప్పాల కృష్ణ

నవతెలంగాణ-సిద్దిపేట

కార్పొరేట్ విద్యాసంస్థలు నారాయణ, శ్రీచైతన్యలు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, కళాశాల వేధింపులు, ఒత్తిళ్ల వల్లే సాత్విక్ మృతి చెందాడని, ఆ విద్యాసంస్థలను వెంటనే రద్దు చేయాలని అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపీఎస్‌యూ) జిల్లా నాయకులు అప్పాల కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ కళాశాలలో తనకు పెట్టె ఒత్తిడి, వేధింపులకు తట్టుకోలేకనే సాత్విక్ సూసైడ్ చేసుకున్నాడని, శ్రీ చైతన్య, నారాయణ విద్యాసంస్థలు ఆత్మహత్యలకు, విద్యార్థుల చావుకు నిలయాలుగా మారాయన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి,శ్రీ చైతన్య, నారాయణ విద్యాసంస్థలను నిషేధించాలన్నారు. లేనిపక్షంలో ఏఐపీఎస్‌యూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐపీఎస్‌యూ డివిజన్ నాయకులు మంకాల శివ, సాయి కుమార్, రవితేజ, వెంకటేష్, శేఖర్ పాల్గొన్నారు.

జిల్లా మహిళా అధ్యక్షురాలిని పరామర్శించిన శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

జిల్లా మహిళా అధ్యక్షురాలికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు రాలు ముగ్దం లక్ష్మీ భర్త ముగ్దం నారాయణ రెడ్డి అనారోగ్యంతో బాధ పడుతూ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న శ్రీనివాస్ రెడ్డి లక్ష్మీని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీకి తోడుగా కాంగ్రెస్ కుటుంబం ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. పరామర్శించిన వారిలో జిల్లా నాయకులు గాంధారి నరేందర్ రెడ్డి, విజయపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి పాత దేవస్థానం 53 వ వార్షికోత్సవం



ఓనవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని పారుపల్లి వీధిలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి పాత దేవస్థానం 53వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామి సేవా సమితి వారి ఆధ్వర్యంలో గురువారం 108 కళాశాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు, బాటసారులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర స్వామి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రెండవ వార్డులో మంచినీటి సరఫరా మరమ్మత్తులు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మున్సిపల్ రెండో వార్డులో మిషన్ భగీరథ నీటి సమస్యపై గురువారం కౌన్సిలర్ బోజ రమాదేవి రవీందర్ తక్షణమే మరమ్మతులు చేపట్టారు. ఎల్ఐసి బిల్డింగ్ వెనకాల మంచినీటి సరఫరా సమస్య ఉందని తమ దృష్టికి రావడంతో పనులు చేపట్టామన్నారు. వార్డులో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

పేద ప్రజలపై గ్యాస్ భారం

- ఎంపీపీ గజ్జల సాయిలు, మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ



నవతెలంగాణ-మిరుదొడ్డి

కేంద్ర ప్రభుత్వం సామాన్య పేద ప్రజలపై గ్యాస్ ధరలు పెంచుతూ భారం మోపుతుందని మిరుదొడ్డి ఎంపీపీ గజ్జల సాయిలు, మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లాల సత్యనారాయణలు అన్నారు. గురువారం మిరుదొడ్డి ఎంపీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తరుచు గ్యాస్ ధరలను పెంచుతూ పేద బడుగు బలహీన వర్గాలపై భారం వేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ సమావేశంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బాలరాజు, ఎఎంసి వైస్ చైర్మన్ మల్లేశం, మాజీ ఏఎంసీ చైర్మన్ బాపు రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు సుకురి లింగం, అంజి రెడ్డి , బైరయ్య, మల్లయ్య, నితిన్ తదితరులున్నారు

అబాది సర్వేలో పలు సూచనలు

- అదనపు కలెక్టర్ ముజామిల్ ఖాన్



నవతెలంగాణ-మర్కుక్

తెలంగాణ ప్రభుత్వం గ్రామాలలో అబాది భూములను క్రమబద్ధీకరించి, భూ యాజమాన్య హక్కు పట్టాలను అందజేయాలనే సదుద్దేశంతో ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా సిద్దిపేట జిల్లా, మర్కుక్ మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ గ్రామాన్ని ఎంపిక చేసిన విషయం తెలిసిందే. గురువారం సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ ముజామిల్ ఖాన్ అంగడికిష్టాపూర్ గ్రామానికి చేరుకుని గతంలో డ్రోన్ కెమెరాతో అబాది సర్వే చేసిన మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం గ్రామంలోనే రోడ్డు విశాలంగా ఉండేటట్టు చూడాలని గ్రామ సర్పంచ్ దుద్దెడ లక్ష్మీ రాములు గౌడ్, పంచాయతి కార్యదర్శి నీలిమా, ఎంపిటీసి గోలి నరేందర్‌కు సూచించారు. అనంతరం గ్రామంలో కలియ తిరుగుతూ పలు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిపీవో దేవకి దేవి, డీఎల్పీవో వేదవతీ, ఎంపీడీవో ప్రవీణ్, ఎంపీవో రాజలింగం, నాయకులు కుమ్మరి కనకయ్య, మీసాల శ్రీనివాస్, సుదర్శన్ గౌడ్,రాముగౌడ్, నరసింహ చారి, అంజనేయులు, లింగని నాగరాజు, వెంకటేష్, తదితరులున్నారు


ఆలయ పునర్నిర్మాణానికి ముందుకొస్తున్న దాతలు



నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో 500 సంవత్సరాల క్రితం ప్రతిష్టించిన శ్రీ సీతారామ ఉమామహేశ్వర విగ్రహ ప్రతిష్ట తిరిగి ఈ నెల 11, 12 ,13 తేదీల్లో నిర్వహించే కార్యక్రమానికి గజ్వేల్ ప్రాంతానికి చెందిన పలువురు వ్యాపారులు, ప్రజా ప్రతినిధులు ప్రతిష్టకు కావలసిన రుణ దాతలు ముందుకు వస్తున్నారు. గజ్వేల్ పాత తాలూకా పరిధిలో సీతారామ ఉమామహేశ్వర దేవాలయానికి ప్రతి సంవత్సరం భద్రాచలంలో జరిగే రాముని కళ్యాణం తర్వాత 15 రోజులకు గజ్వేల్ పట్టణంలో సీతారామ కళ్యాణాన్ని నిర్వహిస్తారు. పురాణత దేవాలయం ఉందని సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల దృష్టికి తీసుకుపోవడంతో దేవాలయ పునర్నిర్మాణానికి రూ. 5 కోట్లు కేటాయించి దేవాలయ పునర్నిర్మాణానికి కంకణం కట్టుకున్నట్లు గజ్వేల్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, ఆలయ కమిటీ కన్వీనర్ శ్రీధర్ రావు 'నవ తెలంగాణ'తో తెలిపారు.

ఊరు మనదిరా సభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కొండపాక

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ఈనెల 5న జరగనున్న ఊరు మనదిరా సభ వాల్ పోస్టర్‌ను గురువారం కొండపాకలో ఆవిష్కరించారు. కల్లు గీతా వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ అంబటి బాలచందర్, వెంకటరమణలు మాట్లాడుతూ తెలంగాణ కవులను, కళాకారులను ఉద్యమకారులను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు . ఐదున జరిగే సభకు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనుకరాజు తిప్పారం హరీష్ గౌడ్ , దుంపలపల్లి భానుప్రకాశ్ , సంతోష్ కుమార్ గుప్తా, దుంపల పల్లి శ్రావణ్ కుమార్, కొమ్ము భాను, రవి తేజ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో 2వ రోజు అంగన్వాడీల ధర్నా

- సమస్యల పరిష్కారానికై కలెక్టర్ కార్యాలయం ముందు బైఠాయింపు



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ టీచర్ ఆయాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కామిని గోపాలస్వామి డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం ముందు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గురువారం సీఐటీయూ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పెద్ద సంఖ్యలో ధర్నా కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి కాముని గోపాలస్వామి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలి. వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 2018 అక్టోబర్లో కేంద్రం పెంచిన వేతనం అంగన్వాడీ టీచర్లకు రూ.1,500/-లు, హెల్పర్లకు రూ.750/-లు, మినీ వర్కర్లకు రూ.1,250/-లు రాష్ట్ర ప్రభుత్వం ఎరియర్స్ సహా చెల్లించాలన్నారు. 2017 నుంచి టీఎ, డిఎ బకాయిలు మొత్తం చెల్లించాలని, దీనికి సరిపడా బడ్జెట్‌ను వెంటనే రిలీజ్ చేయాలన్నారు. 3 సం.రాల రేషన్ షాపు ట్రాన్స్‌పోర్ట్ చార్జీలను వెంటనే చెల్లించాలని, పిఆర్సి ఎరియర్స్ 2021 జూలై, అక్టోబర్, నవంబర్ మూడు నెలలవి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్ వాడిలలో ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, ఈ సమస్య పరిష్కారం కోసం తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. మదర్స్ కమిటీలకు చైర్మన్ గా తల్లులను మత్రమే నియమించాలనీ గ్రామ సర్పంచులను చైర్మన్ నియమాకం చేసే పద్ధతిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఆరోగ్య లక్ష్మి మెనూ ఛార్జీలు పిల్లలకు రూ.1.15 పై.ల నుంచి రూ.5/-లకు, గర్భిణీ/బాలింతలకు రూ.2.40 పై.ల నుంచి రూ.10/-లకు పెంచాలనీ డబుల్ సిలిండర్ అన్ని కేంద్రాలకు ఇవ్వాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా మినీ అంగన్వాడీ సెంటర్లంటినీ మెయిన్ సెంటర్లుగా గుర్తించి అంగన్వాడీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ సెలవులు అమలు చేయాలని కోరారు. 2017 నుంచి ఇంక్రిమెంట్, ఇన్చార్జ్ అలవెన్స్ బకాయిలు చెల్లించాలన్నారు. యాప్‌ను పూర్తిగా రద్దు చేయాలి. కేవలం పోషన్ ట్రాకర్ మాత్రమే కొనసాగించాలనీ, అన్లైన్ పని చేయడానికి వీలుగా ఐప్యాడ్ అంగన్వాడీలకు ఇవ్వాలనీ అన్నారు. అంగన్వాడీ ఉద్యోగులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలనీ అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమాలకు (ఈవెంట్స్) ఇచ్చే డబ్బులు రూ.250/-ల నుంచి రూ.2,000/-లకు పెంచాలని రేషన్ బియ్యాన్ని శుభ్రపరిచిన వెహికల్ ద్వారానే సప్లై చేయాలని డిమాండ్ చేశారు. ఎండకాలంలో ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా అంగన్వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలని, జీవో. నెం 14, 19, 8 లను వెంటనే సవరించి అంగన్వాడీ ఉద్యోగులకు ఆసరా, కళ్యాణ లక్ష్మి, తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమండ్ చేశారు. ఈ ధర్నాకు సంఘీభావంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్లబండి శశిధర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్, కెవీపీఎస్ జిల్లా అధ్యక్షులు బాలకిషన్ లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యకులు దాసరి కళావతి, జిల్లా కోశాధికారి భాస్కర్, చొప్పరి రవికుమార్, జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాలనర్సు, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, జిల్లా కోశాధికారి పద్మ, నాయకులు లక్ష్మి,కళావతి, రమ, విజయ, లక్ష్మి, భూలక్ష్మి, బసవరాని, అనిత, ప్రేమలత, శ్యామల, వీణ, స్వరూప, బాలమణి భాగ్యలక్ష్మి స్వరూప యాదమ్మ మమత కనక ధారా, జ్యోతి, బాబాయి, తారా, లక్ష్మి నర్సవ్వ, తదితరులు పాల్గొన్నారు.

అయిదేళ్లయినా డబుల్ బెడ్ రూంలు పూర్తి చేయారా?



- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

నవతెలంగాణ-గజ్వేల్

పేదలకు డబుల్ బెడ్ రూంలు నిర్మించడానికి ఐదేండ్ల సమయం సరిపోదా అని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ ప్రశ్నించారు. గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలోని ప్రారంభానికి నోచుకోని డబుల్ బెడ్ రూంలను గురువారం డిబిఎఫ్ బృందం పరిశీలించింది. 2018 ఏప్రిల్‌లో మెదక్ యం.పి కొత్త ప్రభాకర్ రెడ్డి రూ 1.26 లక్షలతో శంకుస్థాపన చేసి అరేళ్ళు గడుస్తున్న 25 డబుల్ బెడ్ రూం లు నిర్మాణం చెపట్టినప్పటికి నేటికి పూర్తి చేయకపోవటం చూస్తూంటే పేదల పట్ల నిర్లక్ష్య,వివక్షతకు నిదర్శనమన్నారు. 25 ఇళ్ళలో 19 ఇళ్ళు 75 శాతం పూర్తి అయి శిధిలావస్థకు గురై పిచ్చి మెక్కులు,పశువులకు నిలయంగా మారయన్నారు.గ్రామంలో నేటికి పెదలు గుడిసెలలో జీవిస్తు నరకయాతన పడుతున్నారన్నారు..ప్రజాధనంతో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం లను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేసి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి,డిబిఎఫ్ జిల్లా ప్రదాన కార్యదర్శి బ్యాగరి వేణు తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు.

గ్యాస్ ధరల పెరుగుదలపై భగ్గుమన్న బీఆర్ఎస్











- పెంచిన గ్యాస్ ధరలను వెంటనే నియంత్రించాలి
- దేశంలో మోడీని,దుబ్బాకలో రఘునందన్ ను పరిగెత్తిస్తాం
- మెదక్ ఎంపీ కొత్త పప్రభాకర్ రెడ్డి

నవతెలంగాణ-దుబ్బాక

"ఇక్కడి ఎమ్మెల్యే ఓ జోకర్. పొద్దుగాల లేవగానే నాలుగు కెమెరాలు పట్టుకుని టీవీలు, వాట్సాపుల్లో లైవ్‌లో కనపడాలని ఆగమాగం చేస్తడు. టివిల్లో డిబేట్లు, ఊకదంపుడు ఉపన్యాసాలు, పెద్ద పెద్ద మాటలు మాట్లాడడం తప్ప దుబ్బాక అభివృద్ధి, ప్రజల కోసం ఏనాడు పట్టించుకున్న దాఖలాల్లేవు"అని మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావుపై ధ్వజమెత్తారు. గ్యాస్ సిలిండర్ ధరల పెంపును నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఎదుట రోడ్డుపై బైఠాయించి వంట వార్పు, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం నిర్వహించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ నిరసనలో మెదక్ ఎంపీ పాల్గొని మాట్లాడారు. తాను గెలిచిన అరు నెలల్లోగా హామీలన్నీ నెరవేరుస్తానని వాగ్దానం చేసిన దుబ్బాక ఎమ్మెల్యే గెలిచి రెండేళ్లు గడుస్తున్నా ఏ ఒక్క హామీని ఇంతవరకు నెరవేర్చలేదని విమర్శించారు. చేసిన వాగ్దానాల్ని నిలబెట్టుకోవాలన్న కనీస సోయి ఎమ్మెల్యేకు లేకుండా పోయిందని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే తీరుపట్ల దుబ్బాక ప్రజలు విసిగిపోయారన్నారు. రఘునందన్‌ను గద్దె దింపాలని దుబ్బాక రైతులు, మహిళలు, విద్యార్థులు, ప్రజలందరి మనసుల్లో ఉందన్నారు. త్వరలోనే దేశంలో మోదీని, దుబ్బాకలో రఘునందన్‌ను గద్దెదింపి పరిగెత్తిస్తామని దుబ్బాక వేదికగా ఎంపీ ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, మున్సిపల్ చైర్ పర్సన్ వనిత భూమిరెడ్డి, జెడ్పీటీసీ రవీందర్ రెడ్డి, ఎంపీపీ పుష్పలత కిషన్ రెడ్డి,వైస్ ఎంపీపీ అస్క రవి, ఏఎంసి చైర్ పర్సన్ సిహెచ్ జ్యోతి కృష్ణ, వైస్ చైర్మన్ పద్మయ్య, పిఎసిఎస్ చైర్మన్ కైలాష్, వైస్ చైర్మన్ నరేష్, బీఆర్ఎస్ దుబ్బాక మునిసిపల్, మండల అధ్యక్షులు వంశీకృష్ణ గౌడ్, బాణాల శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మండల సర్పంచ్లు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్లు, పిఎసిఎస్, ఎఎంసి డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

గుజరాత్ కంపెనీలకు ఊడిగం చేస్తున్న మోదీ...

రూ.400 కే గ్యాస్ సిలిండర్ ను ఇస్తానని చెప్పి 2014 లో అధికారం చేపట్టిన ప్రధాని మోదీ నేడు రూ.1100 పైచిలుకు పెంచి పేద ప్రజలపై అధిక భారాన్ని మోపారని,అంబానీ,అదాని లకు చెందిన గుజరాత్ కంపెనీలకు ప్రధాని మోదీ ఊడిగం చేస్తున్నారని మెదక్ పార్లమెంట్ సభ్యుడు, బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. మోదీ ప్రధాని కాకముందు ప్రపంచ కుబేరుల్లో 40 స్థానంలో ఉన్న అంబానీ నేడు నాలుగో స్థానానికి ఎగబాకాడన్నారు.పేదలను కొట్టి కార్పొరేట్లకు పంచడమే బిజెపి సర్కారు లక్ష్యంగా పెట్టుకుందన్నారు. షిప్ యార్డ్,ఎయిర్ పోర్టు,గ్యాస్,పెట్రోల్,ఎల్ఐసి వంటి ప్రభుత్వ సంస్థలన్నింటినీ అమ్మేస్తూ కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు.

నవతెలంగాణ-బెజ్జంకి

నిత్యావసర వస్తువుల ధరలు పెంచి కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలను కుభేరులుగా తీర్చిదిద్దేల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తూ..దేశంలో సామాన్య ప్రజలకు బీజేపీ పార్టీ పెనుభారంగా మారిందని బీఆర్ఎస్ మండలా ధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి అగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడాన్ని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలోని ప్రధాన రోడ్లపై బీఆర్ఎస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక అంబేద్కర్ విగ్రహం చౌరస్తా వద్ద కట్టెల పోయ్యి వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. దేశంలోని సామాన్య ప్రజల జీవనానికి ధరల పెంపు గుదిబండల మారిందని బీఆర్ఎస్ శ్రేణులు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలపై మరో మారు గ్యాస్ ధరలు పెంచి అదనపు భారాన్ని మోపిందని, పెంచిన గ్యాస్ ధరలను వెంటనే నియంత్రించాలని డిమాండ్ చేస్తూ గురువారం హుస్నాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కట్టెల పొయ్యి పెట్టి నిరసన వ్యక్తం చేశారు. పీఎం మోడీ చిత్రపటం ఫ్లెక్సీ ని దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ గ్యాస్ ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఒక్కో గ్యాస్ సిలిండర్ కు రూ. 50లు, కమర్షియల్ కు రూ.300లు పెంచిందన్నారు. సామాన్య ప్రజలు గ్యాస్ వినియోగించుకునే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ (బిజెపి) వైఖరిని ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రజలతో మమేకమై ముందుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఎంపీపీ లకావత్ మానస, మార్కెట్ చైర్మన్ ఎడబోయిన రజిని తిరుపతిరెడ్డి, హుస్నాబాద్ టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వంగా వెంకటరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్వర్, అక్కన్నపేట ఎంపీపీ మాలోతు లక్ష్మీ బీలు నాయక్, జెడ్పిటిసి భూక్య మంగా శ్రీనివాస్, అక్కన్న పేట మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు, కౌన్సిలర్లు బోజు రమాదేవి రవి ,బొజ్జ హరీష్, రమేష్ నాయక్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ గురువారం సిద్దిపేట-హన్మకొండ రహదారిపై నంగునూరు మండలం పాలమాకుల రోడ్డుపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పేద ప్రజలకు భారం పడేలా ధరలు పెంచడం సరైన పద్ధతి కాదన్నారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ప్రధానమంత్రి మోడీకి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డుపైనే కట్టెల పొయ్యితో చాయ్ కాచి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు,మహిళలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-రాయపోల్

దేశంలో మోదీ పాలనలో మహిళలకు కన్నీళ్లు మిగులుతున్నాయని బీజేపీ పాలనలో సామాన్యులకు భారం కార్పొరేట్‌లకు వరంగా ఉందని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ జెడ్పిటిసి లింగాయపల్లి యాదగిరి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు మున్న అన్నారు. గురువారం రాయపోల్ మండల కేంద్రంలో గ్యాస్ ధరలను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014లో అచ్చే దిన్ అంటూ అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ నిత్యావసర ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ సచ్చే దిన్ గా మార్చారని ఆందోళన వ్యక్తం చేసారు. మహిళ దినోత్సవం సందర్భంగా గ్యాస్ ధరలు పెంచుతూ మహిళలకు కానుక ఇచ్చాడని వారు ఎద్దేవా చేశారు. గ్యాస్ ధరలు పెంచడంతో వంట యాదికి వొస్తేనే మహిళలకు కన్నీళ్లు వొస్తున్నాయని, కట్టెల పొయ్యే దిక్కవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ గుప్త, కోఆప్షన్ పర్వేజ్, సీనియర్ నాయకులు ఇప్ప దయాకర్, తిరుమలాపూర్ ఎంపీటీసీ బండారు దేవేందర్, కల్లూరు శ్రీనివాస్, రాజేశ్వర్ రెడ్డి, ఆరెపల్లి సర్పంచ్ కరుణాకర్, రంగారెడ్డి, జీవన్ రెడ్డి, నవీన్ గౌడ్, స్వామి, నరసింహారెడ్డి, రాజు, జగపతి రెడ్డి, మురళి, నందు, శివ, జనార్ధన్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దౌల్తాబాద్

కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలపై మరింత గ్యాస్ భారం వేసిందని గురువారం మండల కేంద్రమైన శివాజీ చౌరస్తాలో టీఆర్ఎస్ శ్రేణులు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

సామాన్యుల పొట్టగొట్టే పథకాలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడం సిగ్గుచేటని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్ర సీఎం కేసీఆర్, తన్నీరు హరీశ్ రావు ఆదేశాల మేరకు ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్డీసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలోని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధర పెంచినందుకు, నిత్యవసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్, ధరలు విపరీతంగా పెంచి సామాన్యుల పొట్ట కొట్టిందన్నారు. ఈ ధర్నాకు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు ప్రజలు రావడం జరిగిందన్నారు. మోడీ సర్కార్ సామాన్యుల రక్తాన్ని పీల్చే విధంగా ధరలు పెంచడం సరైనది కాదన్నారు. వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని, నిర్లక్ష్యం వహిస్తే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్రం వరకు నిరసన సెగ తగులుతుందని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్. సి రాజమౌళి, ఏ ఎం సి చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బీఆర్ ఎస్ పట్టణ అధ్యక్షులు నవాజ్ మీరా, ఆత్మ కమిటీ చైర్మన్ ఉడెం కృష్ణారెడ్డి, గజ్వేల్ మండల అధ్యక్షుడు బెండే మధు, మర్కుక్ మండల అధ్యక్షుడు కర్ణాకర్ రెడ్డి, కొండపాక మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, యూత్ అధ్యక్షులు గడియారం స్వామి చారి, నియోజవర్గ, మండల పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ అనుబంధ సంస్థల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగిందన్నారు.

నవతెలంగాణ-చిన్నకోడూరు

భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రాకముందు రూ.500 ఉన్న వంట గ్యాస్ సిలిండర్ ధర భీజేపి 9 ఏళ్ళ పాలనలో రూ.1200లకు చేరడం కేంద్ర ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని సిద్దిపేట జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ చిన్నకోడూరు ఎంపీపి కూర మాణిక్య రెడ్డి అన్నారు. పెరిగిన వంట గ్యాస్ ధరలకు నిరసనగా చిన్నకోడూరు మండల కేంద్రంలో కట్టెలతో వంట చేస్తు గ్యాస్ సిలిండర్లతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 9 సం.ల క్రితం రూ.5 వందల లోపు ఉన్న గ్యాస్ ధర ప్రస్తుతం రూ.12 వందలకు చేరడం సామన్య ప్రజల నడ్డి విరవడమెనని, కేంద్రం ప్రభుత్వం చేతకాని పరిపాలన చేస్తూ ప్రజల జీవితాలను ఇబ్బందులకు గురి చేస్తున్నరని ప్రజల తరుపున కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కాముని శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కీసర పాపయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ వనిత రవీందర్ రెడ్డి, గంగపూర్ సొసైటీ చైర్మన్ కనకరాజు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఉమేష్ చంద్ర, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు ఇట్టబోయిన శ్రీనివాస్, అటవి శాఖ జిల్లా డైరెక్టర్ తాళ్లపల్లి శ్రీనివాస్, జిల్లా రైతుబంధు డైరెక్టర్ వెంకటేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ కుంటయ్య, కో ఆప్షన్ నెంబర్ సాదక్, సీనియర్ నాయకులు భూమి రెడ్డి, మధుసూదన్ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ శ్రీకాంత్, చిన్నకోడూరు గ్రామ అధ్యక్షులు పంపరి కనకయ్య, సోషల్ మీడియా ఇంచార్జ్ గుడి మల్ల రాజలింగం, బిఆర్ఎస్వి మండల అధ్యక్షులు గుజ్జ రాజు, బిఆర్ఎస్ యువజ న విభాగ మండల అధ్యక్షులు వేణు, వార్డు సభ్యులు కొలను రఘు, వివిధ గ్రామా ల సర్పంచులు, ఎంపిటిసిలు, బిఆర్ఎస్ కార్యకర్తలు, మహిళాలు పాల్గొన్నారు.

ఇంటి పన్నులను పాలకవర్గం పెంచిందంటూ తప్పుడు ప్రచారం



- మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూప

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మున్సిపాలిటీలో ఇంటి పన్నులను పాలకవర్గం పెంచిందంటూ కొంతమంది స్వార్థపరులు తప్పుడు ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకోవాలని ప్రయత్నించడం సబబు కాదని మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూప అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆస్తిపన్ను తగ్గించే విషయంలో పాలకవర్గం రెండుసార్లు తీర్మానించడం జరిగిందని, వాల్యూయేషన్ రెండుసార్లు పెరిగిన నేపథ్యంలో భూమి విలువ పెరగడం వల్ల కొంతమేరకు ఆస్తిపన్ను పెరిగితే పాలకవర్గంపై అబాండాలు వేయడం తగదన్నారు. పన్నులు తగ్గించేందుకు పాలకవర్గం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తుండగా కొంతమంది దుష్ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, కౌన్సిలర్లు చెవిటి లింగం, ఆడెపు నరేందర్, జుబేదా ఖాతూన్, సందుల సురేష్, ముస్త్యాల తార, పచ్చిమడ్ల సతీష్, కో ఆప్షన్ సభ్యులు ముస్త్యాల నాగేశ్వరరావు, యూరవ ఆరోగ్య రెడ్డి, పచ్చిమడ్ల అంజనీదేవి పాల్గొన్నారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే

- జిల్లా ఎన్ఎస్‌యూఐ కోఆర్డినేటర్ తాళ్ల కరుణాకర్ ముదిరాజ్

నవతెలంగాణ-సిద్ధిపేట



రానున్నది కాంగ్రెస్ ప్రభత్వమేనని జిల్లా ఎన్ఎస్‌యూఐ కోఆర్డినేటర్ తాళ్ల కరుణాకర్ ముదిరాజ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ వచ్చే సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజలకు ఐదు వేళ్ళ సాక్షిగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ, ఆడబిడ్డలకు రూ 500లకే గ్యాస్ సిలిండర్, అర్హులైన ప్రతి నిరుపేద కుటుం బానికి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల సాయం, ఇంట్లో ఇద్దరూ వృద్ధులు ఉంటే కనీసం పెన్షన్ ఐదు వేల రూపాయలు, మొదటి ఏడాది రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం.



నవతెలంగాణ-తొగుట

మృతుని కుటుంబానికి దాతలు ఆర్థిక సహాయం అందించాలని చిన్న నాటి మిత్రులు విజ్ఞప్తి చేశారు. గురువారం మండల కేంద్రానికి చెందిన రామొల్ల కర్ణాకర్ ఇటీవల కాలంలో గుండె పోటుతో మృతి చెందాడు. 2010వ సంవత్సరంలో పదవ తరగతి విద్యానభ్యసించి మిత్రులు ఆయన కుటుంబానికి రూ.32 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్ణాకర్ మృతి చెందడం బాధాకరమన్నారు. మృతునికి భార్య కవిత తో పాటు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాకర్ మృతితో వారి కుటుంభం సభ్యులు రోడ్డున పడ్డారని పేర్కొన్నారు. ప్రభుత్వ పరంగా ఎవరైనా దాతలు ఉంటే వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తొగుట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉల్లేంగల సాయి కుమార్, సిలువేరి నరేశ్ గౌడ్, జంగిటి బిక్ష పతి, కాళ్ళ అనిల్ పాల్గొన్నారు.

కోట మైసమ్మ రోడ్డు తొందరగా పూర్తి చేయాలి

- మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శి నీరుడి స్వామి



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్‌లో గత రెండున్నర ఏళ్ల నుంచి రోడ్డు విస్తీర్ణ కోసం చేస్తున్న పనులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయని మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శి నిరుడు స్వామి అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ రోడ్డు గుండా వ్యాపారులు ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అనేకసార్లు మున్సిపల్ అధికారులు, పాలకవర్గం దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదన్నారు. కిలోమీటర్ రోడ్డు సంవత్సరాల తరబడి పనులు జరుగుతున్నాయంటే స్థానిక పాలకవర్గంలో ప్రభుత్వంలో ఎంత నిర్లక్ష్యం ఉందో వేరే చెప్పనక్కర్లేదన్నారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారు కేసులు వేసినట్లు ఆయన తెలిపారు. నెల క్రితం మంత్రి హరీశ్‌రావు బస్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని ఇప్పటివరకు ఎందుకు పనులు ప్రారంభించలేదని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా రోడ్డు భవనాల శాఖ అధికారులు ప్రస్తుతం పూర్తయిన రోడ్డువరకైనా పనులు పూర్తి చేయాలని ఆయన కోరారు.

మినీ ట్యాంక్ బండ్ చేస్తామని మనీ ట్యాంక్ చేశారు

- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి
- సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి..

నవతెలంగాణ-అక్కన్నపేట

హుస్నాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో ఎమ్మెల్యే సతీష్ కుమార్ విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి అన్నారు. గురువారం అక్కన్నపేట మండలం కట్కూరు గ్రామ క్రాసింగ్ వద్ద రేవంత్ రెడ్డి పాదయాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే లెక్కలేనన్ని భూములు ఆక్రమించాడన్నారు. పత్తి తూకాల్లో రైతులు ఎంతో నష్టపోతున్నా కానీ పట్టించుకోవడంలేదన్నారు. కనీసం ప్రజలకు అందుబాటులో ఉండకుండా రెండేళ్లుగా నియోజకవర్గ సమస్యలను పట్టించుకోవడంలేదని సమీకృత భవనం నిర్మిస్తానన్న హామీని తుంగలో తొక్కారన్నారు. నియోజకవర్గంలో ఎంపిక చేసిన 1400 మంది లబ్ధిదారులకు ఇండ్లు ఇవ్వకుండా, కమీషన్లు ఇచ్చిన 480 మందికి ఇండ్లు ఇచ్చారని ఆరోపించారు. సీఎం దత్తత తీసుకున్న చిన్న ములుకనూరులో అందరికీ ఇల్లు కట్టిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ఎమ్మెల్యే నిర్లక్ష్యంతో పోతారం నుంచి రామవరం, రహదారులు లేక ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టులో 120 మంది మహిళ నిర్వాసితులకు ఇప్పటికీ పరిహారం ఇవ్వకుండా మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం నర్సారెడ్డి మాట్లాడుతూ గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల ఏ విధంగా అభివృద్ధి చెందాయో ఆ విధంగా హుస్నాబాద్ కాదా అని ప్రశ్నించారు.. కేవలం వారి నియోజకవర్గాలనే అభివృద్ధి చేసుకుంటూ వెనుకబడ్డ హుస్నాబాద్ ను తుంగలో తొక్కారని ఆరోపించారు. హుస్నాబాద్‌ను మినీ ట్యాంక్ బండ్ చేస్తానని, మనీ ట్యాంక్ బండ్ చేశారని అన్నారు. హుస్నాబాద్ ప్రవీణ్ రెడ్డి హాయంలో తప్ప సతీష్ కుమార్ అభివృద్ధి చేసింది ఏమీ లేదని ఆరోపణ చేశారు. ఒకసారి ప్రవీణ్ రెడ్డికి ఛాన్స్



ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొమ్మల యాదగిరి, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎగిడి ఐలయ్య, అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి,సింగిల్ విండో డైరెక్టర్లు బండి కుమార్, లింగారెడ్డి, హుస్నాబాద్ మండల పార్టీ అధ్యక్షులు బంక చందు, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు పాంబ్రాల దాము, మునిరాజ్, పరశురాం,నవీను, రాకేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాంబాబు, భాస్కర్ నాయక్, మేక రమేష్, స్వామి రెడ్డి,చింతల మల్లారెడ్డి,ప్రభాకర్ గౌడ్, పోశెట్టి, రవి, బాలరాజు, వివిధ గ్రామ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ ఫలితాలు సాధించే దిశగా విద్యార్థులు కష్టపడాలి

నవతెలంగాణ-గజ్వేల్



అత్యుత్తమ ఫలితాలు సాధించే దిశగా విద్యార్థులు కష్టపడాలని మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. అహ్మదీపూర్ గ్రామంలో ప్రభుత్వంచే ఉచితంగా పంపిణీ చేయబడిన అభ్యసనా కరదీపిక పుస్తకాలను ప్రధానోపాధ్యాయులు కరివెూద్దీన్ ఆధ్వర్యంలో గురువారం పదవ తరగతి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మంత్రి హరీవ్‌రావు కృషితో పదవ తరగతి విద్యార్థులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందుతున్నాయన్నారు. మీరంతా బాగా చదివి జిల్లాకు మన గ్రామానికి మంచి పేరు తెచ్చేలా కష్టపడాలన్నారు. సాయంత్రం సమయంలో మీకు మెనూ ప్రకారం అల్పాహారం అందచేస్తున్న విషయాన్ని వారు తెలిపారు. విద్య తోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ముడిపడి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన సైన్సు ఫెయిర్ లో దక్షిణ భారత స్థాయిలో ద్వితీయ శ్రేణి బహుమతి పొందిన విద్యార్థిని పూజను శాలువాతో సత్కరించి రూ.2 వేల బహుమతి ప్రదానం, ఇందుకు సహకరించిన గైడ్ టీచర్ హాఫిజ్‌ని శాలువతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమేష్ గౌడ్ , నిజామోద్దీన్, టీచర్లు, జావేదునిసా బేగం, రామ కృష్ణా, హాఫిజ్, బాలు చరణ్, శ్రీనివాస్ రెడ్డి, విజయలక్ష్మి, శ్రీనివాస్, పద్మా, శ్రీనివాస్, నరేష్ కుమార్, కవిత, మహేందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎంపీ చెక్కు అందజేత



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

మండలంలోని పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన గుండెల బాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అయితే అతను బీఆర్ఎస్ పార్టీలో సభ్యత్వ నమోదు చేసుకోవడంతో మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట రూ.2 లక్షల చెక్కును (బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త) మృతుడి భార్య మల్లవ్వకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్టీలో క్రియాశీలకంగా పని చేసే బాబు ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని, పార్టీ పక్షాన తాము అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా మెదక్ ఎంపీకి బాధిత కుటుంబ సభ్యులు, సర్పంచ్, గ్రామ టీఆర్ఎస్ నాయకులు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు సద్ది రాజిరెడ్డి, పెద్దగుండవెల్లి గ్రామ అధ్యక్షులు మల్లుగారి ప్రేమ్ ప్రభాకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిన్ని సంజీవరెడ్డి , కార్యకర్తలు మహేష్ రాజు తదితరులు ఉన్నారు.

ప్రీతి నాయక్‌కు కొవ్వొత్తులతో నివాళులు

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలంలోని బద్దిపడగ ఊర తాండలో డాక్టర్ ప్రీతి నాయక్‌కు కొవ్వొత్తులతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తండా వార్డు మెంబర్ భూక్య లక్ష్మి- చందర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని, అలాగే గిరిజనుల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. గిరిజన బిడ్డ ప్రీతి నాయక్ మృతికి కారణమైన సైఫ్‌ని కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా గట్టి చట్టాలు అమలు చేయాలని బద్దిపడగ ఊర తాండ వాసుల తరుపున ప్రభుత్వాన్ని కోరారు.



అలాగే ఈ ఘటనపై త్వరగా న్యాయం జరగాలని మంత్రి హరీష్ రావుకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు బుక్య చందర్ నాయక్, బుక్య సంతోష్, బుక్య రాజేందర్ నాయక్, భుక్యా రాజు, రమావత్ కన్నయ్య, మాలోతు భీమా నాయక్, మాలోతు రాజు, కునుసోతు లోకేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి ఓ.. తుపాకీ రాముడు

- గౌరవెల్లి గండిపల్లి ప్రాజెక్టు అడ్డుకుంటున్నది కాంగ్రెస్
- హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

కాంగ్రెస్ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి గండిపల్లి ప్రాజెక్టులో చేసిన వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని, రేవంత్ రెడ్డి ఓ..తుపాకి రాముడని హుస్నాబాద్ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్ అన్నారు. గురువారం గండిపల్లి ప్రాజెక్టులో చేసిన రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు స్పందించిన ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్టును కాంగ్రెస్ పార్టీ అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేసిందని విమర్శించారు. ఎన్ని పార్టీలు ప్రాజెక్టులు అడ్డుకోవాలని చూసినా వెనక్కి తగ్గకుండా 8 టీఎంసీల గౌరవెల్లి ప్రాజెక్టును నిర్మించి పూర్తి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. చివరి దశలో ఉన్న గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి నీళ్ళు నింపుతామన్నారు. అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి కి అత్యంత సన్నిహితులుగా ఉన్న పొన్నం ప్రభాకర్, ప్రవీణ్ రెడ్డి మీరు అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాజెక్ట్ పనులు ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. గండిపల్లి భూసేకరణ పూర్తయిందని, ప్రాజెక్టు పనులను త్వరలో ప్రారంభంచేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గండిపల్లి, గౌరవెల్లి ప్రాజెక్టులను 1.5 టీఎంసీలు చేస్తే హుస్నాబాద్ ప్రాంత రైతంగానికి నీళ్లు సరిపోవని సీఎం కేసీఆర్ ప్రాజెక్టును 8.2టిఎంసీలకు పెంచాడన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టుతో 1 లక్ష 7వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. 126 మీటర్ల ఎత్తులో ఉన్న గౌరవెల్లి ప్రాజెక్టులోకి పంప్ హౌస్ ద్వారా ట్రయల్ రన్ సక్సెస్ చేసుకోవడం



జరిగిందన్నారు. 4వేల ఎకరాల భూ సేకరణ చేసి భూ నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు పరిహారం చెల్లించామన్నారు. తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని, అధికారంలోకి రాబోయేది బీఆర్ఎస్ పార్టీ అన్నారు.

నవతెలంగాణ

బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా



నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తాడెం వెంగళరావు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్ష పదవికి గురువారం రాజీనామా చేశారు. పార్టీలో అనేక సేవలు చేస్తూ తెలంగాణ ఉద్యమ కాలం నాటి నుంచి పార్టీలో కొనసాగుతూ పార్టీ పిలుపు మేరకు కష్ట కాలంలో సేవలందించిన, అధ్యక్ష పదవి చేపడుతున్న తమను బీఆర్ఎస్ కార్యకర్తలు కొంతమంది, కావాలనే మనస్పాపన్ని గురిచేస్తున్నారని, ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి హరీశ్ రావు, మెదక్ పార్లమెంటు సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి సైతం చేగుంట మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇస్తామని, హామీ ఇచ్చారని, సీనియర్‌గా పార్టీకి కష్టపడి పని చేసిన కష్టకాలంలో కూడా పనిచేసినా తన సేవలను గుర్తించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా చేగుంటలోనే వున్నా మండల పార్టీ అధ్యక్షుడికి సమాచారం ఇవ్వకుండానే కొంతమంది బి ఆర్ఎస్ నాయకులు నిరస కార్యక్రమం లు చేపట్టడంతో తాను రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు.

మండల సమస్యను పరిష్కరించాలి



నవతెలంగాణ-రేగోడు

మండలంలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని జెడ్పీటీసీ యాదగిరి స్థాయి సంఘం సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లాలో రేగోడు మండలం చాలా వెనుకబడిపోయిందని, మండలంలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని ఆయన స్థాయి సంఘం సమావేశంలో కోరారు.

మెదక్ ఎంపీని విమర్శించే నైతిక హక్కు బీజేపీకి లేదు



నవతెలంగాణ-చేగుంట

మెదక్ పార్లమెంటు సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డిని కళ్ళు కనిపించ కుండా కొందరు బీజేపీ నాయకులు మతి తప్పి మాట్లాడుతున్నారని తెలంగాణ రాష్ట్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మైలారం రామచంద్రం మండిపడ్డారు. చేగుంట మండలం చిన్న శివ నూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తుంటే, కొంతమంది బీజేపీ దళిత నాయకులు అసభ్య పదజాలంతో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిని దూషించడం మానుకోవాలని దళిత సంఘాల రాష్ట్ర నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రోటోకాల్ పాటించాల్సిన విషయం సంబంధిత అధికారులు చూసుకోవాలని, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిని అసభ్య పదాలతో దూషిస్తే తగిన బుద్ధి చెప్తామని వారు హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో గ్రామ టీఆర్ఎస్ అధ్యక్షులు గోలి సంతోష్, టీఎస్ ఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కొలుపుల స్వామి, యువసేన అధ్యక్షులు బాల సాయి హరిప్రసాద్, కుమార్, నార్సింగ్ మండల అధ్యక్షులు ఆనందాస్ మహేష్,వెంకట్ స్వామి నర్సింలు,విక్రమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకు సిద్దిపేట మిల్లి కౌన్సిల్ ఏర్పాటు



నవతెలంగాణ-సిద్దిపేట

సమసమాజ స్థాపనకు సిద్దిపేట మిల్లి కౌన్సిల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని షోరా పెద్దలు అబ్దుల్ సమీ,ముఫ్తి కరీం పటేల్, ఖాళీలుర్ రెహ్మాన్ అన్నారు. సిద్దిపేట మిల్లి కౌన్సిల్ ఆధ్వర్యంలో గురువారం చిన్న మస్జీద్ వద్ద మినీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన షోరా సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సమసమాజ స్థాపనకు, దేశ సమగ్రతను కాపాడుకునేందుకు అందరూ ఒక్కతాటిపై రావాలన్న సంస్థ ఉద్దేశ్యం చాలా బాగుందన్నారు. యువత అభివృద్ధితో పాటు వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కార్యక్రమాలు రూపొందించడం శుభపరిణామమన్నారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాల్లో తమని కూడా భాగస్వామ్యం చేయడం ఆనందంగా ఉందని, తమ ద్వారా ఎలాంటి అవసరం ఉన్న ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.ఈ కార్యక్రమంలో షోరా కమిటీ సభ్యులు ముఫ్తి అబ్దుల్ సలాం, ముఫ్తి మసూద్ ఆలం , ముఫ్తి మౌలానా, ముఫ్తి కరీం పటేల్, ఇక్బాల్ ఆశ్రఫీ, ముఫ్తి మొహమ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యంరెడ్డి హయాంలోనే అభివృద్ధి



నవతెలంగాణ-రాయపోల్

దుబ్బాక నియోజకవర్గంలోని పేద విద్యార్థులకు విద్యను అందుబాటులోకి తెచ్చిన ఘనత ముత్యంరెడ్డిదేనని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గతంలో వేసిన రోడ్లే తప్ప కొత్తగా రోడ్లు వేసిన నాథుడే లేడన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారాయని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. దుబ్బాక ప్రశ్నించే గొంతుక అని చెప్పుకునే రఘునందన్ రావు గొంతుక నేడు ఎందుకు మూగబోయిందో చెప్పాలన్నారు. నిధులన్నీ సిద్ది పేట, గజ్వేల్‌లకు మళ్లిస్తుంటే గెలిచిన ఎమ్మెల్యే చోద్యం చూస్తున్నారని ఎమ్మెల్యే రఘునందన్ రావు అసమర్థత వల్ల దుబ్బాక అభివృద్ధిలో వెనకబడిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కారణాల శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, పడాల రాములు, భూపతి రావు, కిష్టారెడ్డి, వెంకటరెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు





నవతెలంగాణ-రాయపోల్

భక్తులు కొంగుబంగారంగా భావించే ప్రసన్న వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహణకు రాయపోల్ మండలంలోని వడ్డే పల్లి గ్రామంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం, శుక్రవారం రెండు రోజులు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆదివారం మొదటి రోజు ఉదయం ఆలయ ప్రవేశము, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహ వాచన, అఖండ దీపస్థాపన, మాతృకా , నాంది , అంకురా రోపణము, అన్నపూజ, ఆకులపూజ, అన్నదాన కార్యక్రమము సాయంకాలము పొన్నసేవ, శ్రీస్వామివారి కళ్యాణము. రాత్రి సుంకు భద్రకాళీ ఆవాహనము , అగ్నిగుండము , శ్రీ స్వామివారిరథోత్సవము గెలుపు, ఋత్విక్ సన్మానము ఉంటుంది. అలాగే రెండో రోజు సోమవారం రోజున ఉదయం అగ్ని గుండం, శ్రీ స్వామివారి రథోత్సవం గెలుపు, ఋత్విక్ సన్మానం, అనంతరం అన్నదాన కార్యక్రమము , సాయంత్రము దోపుసేవ జరుపబడును. ఈ బ్రహ్మోత్సవాలకు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి దేవాలయమును విద్యుత్ కాంతులతో సుందరంగా ముస్తాబు చేసి చేయడం జరిగిందని వడ్డేపల్లి, దొడ్డ పల్లి, వీరా రెడ్డి పల్లి, అప్పాయిపల్లి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భక్తులు సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా మంచినీరు చలువ పందిరి అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని వడ్డే పల్లి గ్రామ సర్పంచ్ బచ్చు చంద్రశేఖర్ తెలిపారు .

మతి భ్రమించి బీఆర్ఎస్ నాయకులపై విమర్శలు



నవతెలంగాణ-మర్కుక్

బిజెపి నాయకులకు ప్రజలలో ఆదరణ కరువై మతి భ్రమించి, బీఆర్ఎస్ పార్టీ ,సిఎం కెసిఆర్‌పై స్ట్రీట్ కార్నర్ సమావేశం పేరుతో విషప్రచారం చేయటం సిగ్గుచేటని బీఆర్ఎస్ మర్కుక్ మండలాధ్యక్షులు మర్కుక్ కర్ణాకర్ రెడ్డి, జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రాంచంద్రం యాదవ్ ,ఎంపిటీసీ ఫోరం మర్కుక్ మండలాధ్యక్షులు రాజమైన కృష్ణ యాదవ్‌లు అన్నారు.గురువారం మర్కుక్ లో స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మర్కుక్ మండల అభివృద్ధికి ఎంచేశారో ప్రజలకు తెలుసాన్నారు.బిజెపి గ్రామాలలో పెట్టె కార్నర్ సమావేశాలలో ఖాళీ కుర్చీలే దర్శనమించాయని ఎద్దేవా చేశారు. తెలంగాణాలో సిఎం కెసిఆర్ నేతృత్వంలో అనేక సంక్షేమ పథకం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పెచ్చిన పెట్రోల్ డిజీల్, గ్యాస్ ధరలను తగ్గించాలని బిజెపి నాయకులు ప్రజల పక్షాన దర్నా చేయాలని డిమాండ్ చేశారు. మర్కుక్ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, బీఆర్ఎస్ మేకల కనకయ్య ముదిరాజ్,వంటి మామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పత్తిబాబు యాదవ్,పీఏసీఎస్ డైరెక్టర్ దుబ్బాక యాదగిరి,తుమ్మల కనకయ్య అప్పాల మల్లేశం,బాల్ నర్సయ్య, బి.మహేష్, సాయిని మహేష్, సాయికుమార్ గౌడ్,పాతూరు మల్లేశం,పిట్ల మహేష్, తదితరులున్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి.

నవ తెలంగాణ-నర్సాపూర్ : పురపాలక సంఘం నర్సాపూర్ పరిధిలోని 1, 11, 12, 13 వార్డులలో చేపడుతున్న అభివృద్ధి పనులను,సకాలంలో పూర్తి చేయాలని,మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ సదరు కాంట్రాక్టరుకు సూచించారు.గురువారం నర్సాపూర్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో1,11,12,13 వార్డులో చేపట్టిన వివిధ పనులను పర్యవేక్షించి పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి, పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు.

యువత స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపాలి

- తిగుల్‌లో నిత్య సూపర్ మార్కెట్ ప్రారంభం



- ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి

నవతెలంగాణ-జగదేవపూర్

నిరుద్యోగ యువత ఖాళీగా ఉండకుండా స్వయం ఉపాధి రంగాలను ఎంచుకుని ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తిగుల్ గ్రామంలో నర్సింహారెడ్డి, కృష్ణచారి యువకులు నూతనంగా ఏర్పాటు చేసిన నిత్యా సూపర్ మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న నిరుద్యోగులు కన్నవాళ్లకు భారం కాకుండా స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపాలని సూచించారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉపాధి బాట పట్టి ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఖాళీగా ఉంటే చెడు వ్యసనాలకు అలవాటు పడి బంగారు భవితను గుగ్గిపాలు చేసుకోవద్దని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని, నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ముఖ్య అతిథులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ భానుప్రకాష్ రావు, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ మంజుల మహేందర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, వార్డు సభ్యులు ఆంజనేయులు, ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లయ్య, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఐలయ్య, రైతుబంధు గ్రామ కమిటీ అధ్యక్షుడు అశోక్, సీనియర్ నాయకులు దయానంద్ రెడ్డి, వెంకట్ గౌడ్, రామచంద్రారెడ్డి, అంజిరెడ్డి, నిర్వాహకులు నరసింహ రెడ్డి, కృష్ణ చారి తదితరులు పాల్గొన్నారు.

ధర్నా స్థలాన్ని పరిశీలించిన జేఏసీ నాయకులు



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నులు వసూలు చేసే విధానాన్ని పాత పద్దతిలోనే కొనసాగించాలని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్ డిమాండ్ చేశారు. పాత పద్దతిలోనే ఇంటి పన్నులు వసూలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం, జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 6న మున్సిపల్ ఎదుట నిర్వహించబోయే ధర్నా సభాస్థలాన్ని జేఏసీ నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా విపరీతంగా పెంచిన ఇంటి పన్నులను పాత పద్ధతి ప్రకారంగానే వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జేఏసీ కో చైర్మన్ పుర్మ ఆగం రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందె బీరయ్య, వర్తక సంఘం అధ్యక్షులు తడక లింగం, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, అంజయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎల్వోసిని అందజేసిన ఎంపీ



నవతెలంగాణ-చేగుంట

చేగుంట పట్టణానికి చెందిన కృష్ణ అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రి చికిత్స పొందుతున్నారు. మెరుగైన వైద్యం కోసం గురువారం మెదక్ పార్లమెంటు సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి రూ.2 లక్షల 50 వేల ఎల్ఓసిని మంజూరు చేశారు. చేగుంట మండల ఎంపీపీ మాసుల శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఎల్వోసిని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వడ్డేపల్లి నర్సింలు, మాజీ పిఏసిఎస్ చైర్మన్ కోమండ్ల నారాయణ రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి రాజీనామా..బీఆర్ఎస్‌లో చేరిక



నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండలం పొలంపల్లి గ్రామానికి చెందిన 14 మంది యువకులు బీజేపీకి రాజీనామా చేసి గురువారం మెదక్ పార్లమెంటు సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. దుబ్బాక నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీలోకి వలసల పరంపర కొనసాగుతూనే ఉన్నాయి. గ్రామ బీజేపీ బూత్ అధ్యక్షుడు యాట బాలరాజుతో పాటు బీజేపీ నాయకులు స్వామి గౌడ్, మహేందర్, విజయ్, యాట విజయ్, చింతకాయల మహేందర్, యాట శివ, యాట నవీన్, రాఘవేంద్ర, గొల్ల సురేష్, అఖిల్, నవీన్, వంశీ, ఎల్లాగౌడ్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీతో అభివృద్ధి అసాధ్యమని గమనించి, బీఆర్ఎస్‌లో చేరారు. దుబ్బాక అభివృద్ధి కొత్త ప్రభాకర్ రెడ్డితోనే సాధ్యం అని, దుబ్బాక నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ వైపే తాము ఉంటామని వారు తెలిపారు.